


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 36 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 29 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# మొంథా బీభత్సం

## గాలులు, వర్షాలతో కుదిపేసిన తుఫాన్

## అర్ధరాత్రి సమయానికి తీరం దాటిన 'ముప్పు'








- బందరు వద్ద 100 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు తీర గ్రామాల్లో అలుముకున్న చీకట్లు
- ప్రభావిత ప్రాంతాల్లో కుప్పకూలిన వృక్షాలు
- గోదావరి జిల్లాల్లో చెట్టు కూలి ఇద్దరు మృతి.. నెల్లూరు జిల్లాలో వాగులో ఒకరి గల్లంతు
- పలు జిల్లాల్లో పంటలను ముంచిన తుఫాను
- కావలిలో 22, ఉలవపాడులో 17 సెం.మీ. వర్షం
- రాష్ట్రంలో నేడూ కొనసాగనున్న భారీ వర్షాలు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తీవ్ర తుఫాన్ మొంథా బీభత్సం సృష్టించింది! హోరుగాలులు, జోరు వానలతో వణికించింది! మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరం దాటింది. ఈ సమయంలో 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయి. అప్పుడప్పుడు వాయువేగం 110 కిలోమీటర్లకూ చేరింది. తీవ్ర తుఫాన్ కారణంగా మంగళవారం తీర ప్రాంతమంతా రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ప్రధానంగా ఏడు జిల్లాల్లో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా కూలిపోయాయి. తీవ్ర గాలుల తీవ్రతకు కరెంటు స్తంభాలు పడిపోవడంతో కృష్ణా జిల్లా తీర ప్రాంతమంతా అంధకారం అలుముకుంది. తుఫాన్ ప్రభావంతో కోస్తాలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షాలు - మిగతా 2లో



## 8వ వేతన కమిషన్‌కు ఆమోదం

- కమిషన్ చైర్‌పర్సన్‌గా మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనాప్రకాశ్ దేశాయ్
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు
- 18 నెలల్లోగా సిఫార్సులను సమర్పించనున్న కమిషన్
- వేతన కమిషన్‌తో 1.19 కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి
- 2025-26 రబీ సీజన్‌లో ఎరువులపై రూ. 37,952 కోట్ల సబ్సిడీ

5

## ఉత్తర బిహార్‌లో ఉనికి పోరాటం



- మొత్తం 71 స్థానాల్లో ఒకే ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే
- గత ఎన్నికల్లో 20 నియోజకవర్గాల్లో పోటీ
- ఈసారి 18 స్థానాల్లో బరిలో నిలిచిన హస్తం అభ్యర్థులు
- ఇబ్బందికరంగా మారిన అంతర్గత కుమ్ములాటలు

# ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం



- జిల్లాల పునర్వ్యవస్థీకరణలో ఇవే ముఖ్యం: సీఎం.. పవన్‌తో కలిసి సమీక్ష
- కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాలపై ఇప్పటివరకు 12 వేల వినతులు
- గత తప్పులన్నీ సరిచేయాలి.. కొత్త ఇబ్బందులు రాకుండా చూడాలి
- భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల పునర్విభజననూ దృష్టిలో పెట్టుకోవాలి
- సీఎం దిశా నిర్దేశం.. కొత్త జిల్లాలుగా మార్కాపురం, మదనపల్లె!

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం లక్ష్యంగా జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగానే మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. ఈ నేప?థ్యంలో ఉపసంఘం బుధవారం సచివాలయంలో సమావేశం కానుంది. రాష్ట్రంలో జిల్లాల పునర్‌వ్యవస్థీకరణపై అధ్యయనం చేసి సిఫారసులు అందించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు వంటి అంశాలపై రెవెన్యూ శాఖకు ఇప్పటి వరకు 12 వేల వినతులు వచ్చాయి. జిల్లాల నుంచి వచ్చిన కొన్ని ప్రతిపాదనలతో ఆ శాఖ నివేదిక రూపొందించింది. దానిపై ఉపసంఘం చర్చించింది. జిల్లాల్లో పర్యటించి - మిగతా 2లో



## మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు 'సుప్రీం' ఊరట

- ఉమ్మడి ఏపీలో 1,200 మంది ఉద్యోగాలు సేఫ్
- కారుణ్య నియామకాలను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
- హైకోర్టు తీర్పును కొట్టేసిన జస్టిస్ అరవింద్‌కుమార్ ధర్మాసనం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో కారుణ్య నియామకాల కింద తిరిగి విధుల్లోకి తీసుకున్న 1,200 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు (ఎంపీహెచ్‌ఏ-పురుషులు) సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వీరి నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం - మిగతా 2లో



## విలాస వైభోగమే

- దేశ ప్రజల్లో పెరుగుతున్న 'విలాస' వ్యయాలు
- జనాభాలో పెరుగుతున్న ఎగువ మధ్య తరగతి
- తలసరి ఆదాయం 2031 నాటికి 5,242 డాలర్లు
- ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ నివేదికలో వెల్లడి

5

## తుఫాన్ తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి

- సమస్య ఉన్న చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలి:
- కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్
- అర్ధరాత్రి వరకు సచివాలయంలోనే మకాం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరు
- మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'మొంథా' తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు ఉంటే.. ప్రజలకు భరోసా ఇచ్చినట్లవుతుందని చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఆయన అమరావతి సచివాలయంలోనే ఉండి విరామం - మిగతా 2లో

# విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

- పుకార్లు నమ్మవద్దు.. తుఫాను బాధితులందరికీ పరిహారం ఇస్తాం
- తుఫాన్ బాధితుల ఆకలి తీర్చేందుకు అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తా
- రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం

కోస్తాజిల్లాలను వణికిస్తున్న మెంతా తుఫాను తీవ్రత కారణంగా ఎటువంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు గన్నవరం నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని తుఫాను పునరావాస శిబిరాలను మంగళవారం మధ్యాహ్నం యార్లగడ్డ సందర్శించారు. ముందుగా చెంచుల కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని అనంతరం కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస శిబిరంలోని వసతులను పరిశీలించిన ఆయన బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరావు మాట్లాడుతూ గన్నవరం మండలంలోని కేసరపల్లి గ్రామం తోపాటు చన్నుపల్లి వారి గూడెం, కట్టుబడి పాలెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి 450 మందిని శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. శిబిరాలలో తలదాచుకున్న బాధితులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదృష్టవశాత్తు ఇతర జిల్లాలతో పోల్చుకుంటే కృష్ణా జిల్లాలో తుఫాను ప్రభావం తక్కువగా ఉందని, గన్నవరం నియోజకవర్గంలో వర్షపాతం తక్కువగా నమోదు అయిందన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని అధికారులు అందరూ తుఫాన్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస శిబిరాలకు తరలించేందుకు కృషి చేస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు భారీ వర్షాలు కురిస్తే పునరావాస శిబిరాలను మరిన్ని పెంచాల్సి ఉంటుందని, ఇందుకోసం అవసరమైతే గతంలో బుడమేరు వరదల మాదిరిగా తన సొంత నిధులు వెచ్చించి కళ్యాణ మండపాలను అద్దెకి తీసుకొని బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తుఫాన్ బాధితులకు సాయం పై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని పుకార్లు నమ్మవద్దని హితవు పలికారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా బాధితులందరికీ ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. స్థానికులు ఇళ్ల స్థలాలు సమస్యను ప్రస్తావించగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశం ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే ఇల్లు లేని పేద వారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సాయం అందించాలని మహిళలు కోరగా సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తుఫాన్ సహాయ చర్యల్లో పాల్గొని ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తుఫాన్ బాధితులకు అండగా ఉండాలని యార్లగడ్డ పిలుపునిచ్చారు. జోరు వానలో తడుస్తూనే యార్లగడ్డ సహాయ శిబిరాలను సందర్శన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరుమామిళ్ల సూర్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, దయ్యాల రాజేశ్వరరావు, గొడ్డళ్ళ చిన్న రామారావు, కొలుసు రవీంద్రబాబు, టిడిపి నాయకులు సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, బొప్పన హరికృష్ణ, బోడపాటి రవి , కోనేరు సందీప్, కుందేటి చంద్రశేఖర్, కోసూరు వెంకట్, అన్నే హరికృష్ణ, మల్లంపాటి జయకృష్ణ, కొసరాజు సాయిరాం, మేడేపల్లి రమ, జాస్తి శ్రీధర్, బండి వెంకట్రావు, కొమ్మరాజు సుధీర్, పడమట రంగారావు, బుస్సే నాగప్రసాద్, పరుచూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొంథా బీభత్సం

-మొదటిపేజీ తరువాయి

కురుస్తున్నాయి. ఇవి బుధవారం తెల్లవారుజాము వరకూ కొనసాగుతాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయని హెచ్చరిక జారీచేశారు. కోస్తా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ మెసేజ్ జారీచేసింది.

**కడలి కల్లోలం...**

మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కమ్ముకొచ్చిన మేఘాలతో చీకట్లు అలుముకున్నాయి. వానకు గాలులు కూడా తోడయ్యాయి. తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో 50 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో వీసిన గాలులతో తీరప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. గాలులకు చాలాప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉండటంతో శ్రీకాకుళం జిల్లాపై తుపాను తీవ్ర ప్రభావం చూపింది. మంగళవారం జిల్లా అంతటా వర్షం కురుస్తూనే ఉంది. ఒడిశా నుంచి వస్తున్న వరదతో మహేంద్రతనయ, బహుదా, వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహించాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. విజయనగరం జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి.

**దక్షిణ కోస్తాలో..**

ఒకవైపు ఈదురు గాలులు, మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో ప్రకాశం జిల్లా ఒంగోలుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 6వేల క్యూసెక్కులు వరద వస్తుండగా 4గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. బాపట్ల జిల్లాలో నిజాంపట్నం దగ్గర సముద్రం 150 మీటర్లు ముందుకొచ్చింది.

**తీరం దాటిన చోట గందరగోళం**

మొంథా తుఫాను నిర్దిష్టంగా ఎక్కడ తీరాన్ని తాకింది... ఎక్కడ దాటిందనే అంశంపై పలురకాల అంచనాలు వెలువడ్డాయి. అది కాకినాడకు దక్షిణాన మచిలీపట్నం-కళింగపట్నం మధ్య యానాం వద్ద తీరాన్ని తాకినట్లు విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది. యానాం- నర్సాపురం మధ్య అంతర్వేది సమీపంలో తీరం దాటిందని కొందరు చెబుతుండగా... మచిలీపట్నం - హంసలదీవి మధ్య తీవ్ర తుఫాన్ తీరం దాటిందని మరొకరు చెప్పారు. మొత్తానికి... మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు తుఫాను తీరాన్ని తాకింది. ఆ తర్వాత కొన్ని గంటలపాటు తీరాన్ని దాటే ప్రక్రియ కొనసాగింది.

**నేడూ భారీ వర్షాలు...**

మొంథా తుఫాన్ తీరం దాటిందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాకినాడకు 90 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 90 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 220 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తీవ్ర తుఫాన్ క్రమంగా బలహీన పడుతుందని తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలుబీ ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది.

**22 జిల్లాలు..403 మండలాలు**

**తుఫాన్ ప్రభావంపై ప్రభుత్వ అంచనా**

రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లోని 403 మండలాలపై మొంథా తుఫాన్ ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దానికి తగినట్టే చర్యలు తీసుకుంటున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు జిల్లాలను మినహాయిస్తే తక్కిన రాష్ట్రమంతా ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 75,802 మందిని ఈ కేంద్రాలకు తరలించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 38వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని ప్రాథమికంగా అంచనా. 1.38లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు కూడా ప్రభావితం అయినట్లు ప్రభుత్వం అంచనా వేసింది.

**తిరుమలలో ఎడతెరిపిలేని వర్షం**

మొంథా తుఫాన్ ప్రభావంతో తిరుమలలో మంగళవారం ఒకవైపు ఎడతెరిపిలేని వర్షం, మరోవైపు చలిగాలులతో భక్తులు అవస్థలు పడ్డారు. వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు ఈదురుగాలులతో వాన కురిసింది. వానల వల్ల భక్తుల రద్దీ కూడా తగ్గింది. దర్శనం కోసం 18 కంపార్టుమెంట్లలోనే భక్తులు వేచిఉన్నారు. వీరికి టీటీడీ వేడివేడి అన్నప్రసాదాలు, పాలు అందిస్తోంది. తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీనగర్ మూడోలైన్‌లో గాలులకు ఓ భారీ వృక్షం పక్కనే ఉన్న ఇళ్లపై వాలిపోయింది. రెండు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈస్ట్‌బాలాజీనగర్‌లో ఓ చెట్టు కారుపై కూలింది.

**సింహగిరి మెట్ల మార్గం మూసివేత**

భారీ వర్షాల కారణంగా సింహగిరి మెట్ల మార్గంలో భక్తుల రాకపోకలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం కొండదిగువన తొలిపావంచా వద్ద, సింహగిరిపై మెట్ల ప్రారంభంలో బారికేడ్లు ఏర్పాటుచేశారు. మెట్లమార్గంలో భారీగా వర్షం నీరు ప్రవహిస్తుండడంతో భక్తులు ప్రమాదాల బారినపడకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు. వర్షాలతో సింహగిరి జలకళ సంతరించుకుంది.

## తుఫాన్ తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

లేకుండా వరుస సమీక్షలు జరిపారు. ఆర్‌టీజీఎస్ నుంచి మూడు సార్లు సమీక్షలు చేసిన ఆయన.. రెండు సార్లు కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం లేకుండా, ఆస్తి నష్టం ఎక్కువ జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సీఎం చెప్పారు. ఆర్‌టీజీఎసకు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి, రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి.. అంటే గాలికి పడిపోయిన చెట్ల తొలగింపు, సబ్‌స్టేషన్లలో సమస్యలను తక్షణం పరిష్కరించేలా ఆయన చర్యలు చేపట్టారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలకు వెళ్లిన మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిరంతరం చర్చిస్తూ వచ్చారు. 'తుఫాన్ ప్రభావం వల్ల కరెంట్ కట్ చేయాల్సి రావచ్చు. ముందుగానే ప్రజలకు క్యాండిళ్లను సరఫరా జరిగేలా చూడాలి. పునరావాస శిబిరాల్లో ఉండే వారికి లోటు లేకుండా చూసుకోవాలి. తుఫాన్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసుకుని, జాతీయ రహదారులపై రాకపోకలను నిలిపివేయాలి. ఆ పరిస్థితి వస్తే ముందుగానే సమాచారాన్ని అందించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి' అని ఆదేశించారు.

**అధికారులు గ్రామాల్లో ఉంటే ప్రజలకు నమ్మకం: సీఎం**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఐదారుగురు అధికారులతో ఓ బృందాన్ని పంపాలని సీఎం ఆదేశించారు. వారు గ్రామాల్లో ఉంటే ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కాలువలు, చెరువులు, రోడ్లకు ఎక్కడైనా కోతలు, గండ్లు పడ్డాయా అనే అంశంపై రాత్రిపూట కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత శాఖలవారీగా నష్టం అంచనా నివేదికలను సిద్ధం చేసుకోవాలని, ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి వీలైనంత త్వరగా పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ ప్రభావం తగ్గగానే యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఏలేశ్వరం రిజర్వాయరు, బుడమేరు తదితర వాగుల్లో ప్రవాహాలపై సీఎం ఆరా తీశారు. వరద నిర్వహణకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సీఎం సూచించారు.

**మీరే ప్రభుత్వ ప్రతినిధులు..**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో గ్రామ/, వార్డు సచివాలయాల సిబ్బందితోనూ ఆర్‌టీజీఎస్ నుంచి సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రతినిధులు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందే. బాధితులకు తక్షణ సాయం అందేలా చూడాలి. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన చోట వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు.

**గత తుఫాన్ల నష్టాన్ని బేరీజు వేసుకుని చర్యలు**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు మంత్రులు, అధికారులకు స్పష్టంచేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశమున్న చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని సహాయ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు.

## ఏఐ విప్లవానికి నాయకత్వం వహించిన సామ్‌సంగ్




విజయవాడ

భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్ సంగ్, ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో 'అందరికీ ఏఐ' అనే తన దార్శనికత ద్వారా ప్రజలు ఎలా జీవిస్తారు, కనెక్ట్ అవుతారు, ఆవిష్కరణలు ఎలా చేస్తారో పునర్నిర్వచించు కుంటోంది. 'ఇన్నోవేట్ టు ట్రాన్స్‌ఫార్మ్' అనే థీమ్‌తో కలిసి, ఐఎంసీ 2025లో సామ్‌సంగ్ ప్రదర్శన ఏఐ ఆధారిత జీవనం, సుస్థిర కనెక్టివిటీ భవిష్యత్తుకు జీవంపోస్తుంది. కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖగుప్తా వంటి వినియోగదారులు, ప్రముఖుల నుండి సామ్‌సంగ్ బూత్ కు అత్యున్నత స్పందన లభించింది. సామ్‌సంగ్ సౌత్ వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ అతిథులను స్వాగతించి, వారికి సామ్‌సంగ్ తాజా ఏఐ నేతృత్వంలోని ఆవిష్కరణలను ప్రదర్శించారు.

## ప్రజాభీష్టం.. పాలనా సౌలభ్యం

-మొదటిపేజీ తరువాయి

ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని ఉపసంఘం భావించినా అది జరగలేదు. దీంతో ఈ విషయంలో అనుకున్నంత వేగంగా చర్చ జరగలేదు. ఈ నేప?థ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం సదరు ఉపసంఘంతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నారాయణ, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ జూమ్ మీటింగ్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ఓ నివేదిక సమర్పించింది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ఇప్పటి దాకా వచ్చిన ప్రతిపాదనలు, పరిశీలనలో ఉన్న అంశాలపై ఆ శాఖ ఇన్‌చార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ హయాంలో లోక్‌సభ నియోజకవర్గం కేంద్రంగా జిల్లాల విభజన చేయడాన్ని ముఖ్యమంత్రి తప్పుపట్టినట్లు తెలిసింది. నాడు ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పార్లమెంటు స్థానం ప్రాతిపదికగా విభజించారని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నట్లు సమాచారం. 'లోక్‌సభ సీటు ఆధారంగా జిల్లాల ఏర్పాటుతో జిల్లా కేంద్రానికి అందులోని ఇతర ప్రాంతాలు చాలా దూరంలో ఉన్నాయి. అవి మరో జిల్లాకు దగ్గరలో, సొంత జిల్లాకు సుదూరంగా ఉన్నాయి. దీనిపై అభ్యంతరాలు వచ్చినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీని ఫలితం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చాం. కాబట్టి ఇప్పుడు పార్లమెంటు స్థానం ప్రాతిపదికగా కాకుండా అన్ని ప్రాంతాలకు దగ్గరగా జిల్లా కేంద్రం, ప్రజాభీష్టం, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని అధ్యయనం చేయాలి' అని చంద్రబాబు ఉపసంఘానికి తేల్చిచెప్పారు. ఈసారి జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగితే.. గత ప్రభుత్వం చేసిన తప్పులు, వాటివల్ల తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వల్ల కొత్త ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ముంపు మండలాలపైనా స్పష్టత**

భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని కొత్త జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరగాలని సీఎం అన్నారు. జనా భా, ఇతర సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని.. ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి సలహాలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలన్నది ఆ ప్రాంత ప్రజల చిరకాల కోరికని గుర్తుచేశారు. పోలవరం ముంపు మండలాలపై కూడా స్పష్టత తీసుకురావాలని ఆదేశించారు.

**కొత్తగా 2 జిల్లాలు..!**

ప్రస్తుతం రాష్ట్రంలో 26 జిల్లాలు, 77 రెవెన్యూ డివిజన్లు, 679 మండలాలున్నాయి. జగన్ ప్రభుత్వం శాస్త్రీయ విధానాలు, నిపుణుల సూచనలను కాదని..రాజకీయ ప్రయోజనాలు ఆశించి లోక్‌సభ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని జిల్లాల విభజన చేసింది. 13 జిల్లాలను 26గా చేసింది. అయితే అనేక జిల్లాల్లో సమస్యలున్నాయి. జిల్లా కేంద్రానికి వందల కిలోమీటర్ల దూరంలో మండలాలు, డివిజన్లు ఉన్నాయి. అవి మరో జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్నాయి. ఇలాంటి సమస్యలకు ఇప్పుడు శాస్త్రీయ పరిష్కారం చూపాలని సీఎం ఆదేశించారు. ఎన్నికల సమయంలో మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి రెవెన్యూ శాఖ కూడా ప్రతిపాదించింది. అలాగే రాష్ట్రంలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్ గా ఉన్న మదనపల్లెను కూడా కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది. దీనిపై చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నేతలతో సంప్రదించాలని ఉపసంఘం భావిస్తున్నట్లు తెలిసింది. పోలవరం నిర్మాణం తర్వాత ముంపు మండలాలను ఏం చేయాలన్నది పెద్ద సమస్య. వాటిని ప్రధాన కేంద్రం దగ్గరగా ఉండే జిల్లాలో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కాగా.. 28 నియోజకవర్గాల్లోని 86 మండలాలను డివిజన్లు, జిల్లాలవారీగా మళ్లీ పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదనలు వచ్చాయి. అన్నమయ్య జిల్లా ప్రధాన కేంద్రాన్ని రాయచోటి నుంచి రాజంపేటకు మార్చాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉంది. బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గం మొత్తాన్నీ ప్రకాశం జిల్లాలో కలపాలన్న ప్రతిపాదనలు టీడీపీ నేతల నుంచే వచ్చాయి. వీటన్నిటిపై ఉపసంఘం బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో చర్చించనుంది. ముఖ్యమంత్రి సూచన మేరకు ఈ భేటీని ఖరారుచేసినట్లు తెలిసింది.

## మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లకు 'సుప్రీం' ఊరట

-మొదటిపేజీ తరువాయి

పక్కనపెట్టింది. జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం, ఈ ఉద్యోగులను సర్వీసులో కొనసాగించేందుకు అనుమతిస్తూ మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

**ఏళ్ల తరబడి న్యాయ పోరాటం**

2003లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం సుమారు 2,300 ఎంపీహెచ్ఏ (పురుష) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు ఇంటర్మీడియట్ ండిప్లొమాను అర్హతగా నిర్ణయించింది. ఆ తర్వాత అర్హతను పదో తరగతి ం డిప్లొమాగా మార్చడంతో వివాదం మొదలైంది. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లగా.. 2012లో పదో తరగతి ం డిప్లొమా అర్హతనే ఖరారు చేస్తూ సుప్రీంకోర్టు తుది తీర్పునిచ్చింది. దీంతో అప్పటికే ఇంటర్ ం డిప్లొమా అర్హతతో ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న సుమారు 1,200 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన 1,200 మంది ఏళ్లపా టు అందించిన సేవలను పరిగణనలోకి తీసు కున్న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం, మానవతా దృక్పథంతో 2013లో వారిని కాంట్రాక్ట్ పద్ధతిలో కారుణ్య నియామకాల కింద తిరిగి విధుల్లోకి తీసుకుంది. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా, తెలంగాణ హైకోర్టు ఆ నియామకాలను రద్దు చేసింది. దీనిపై ఉద్యోగులు, ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. విచారణ సందర్భంగా 2003 నాటి నియామకాలతో సంబంధం లేకుండా, పూర్తిగా కారుణ్య కారణాల

విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 29 అక్టోబర్ 2025




# మొంథా తుఫాను బీభత్సం

## పెరుగుతున్న ఈదురుగాలులు



### తుఫానును ఎదుర్కోవడంలో

# ముఖ్యమంత్రి అపార అనుభవం సహాయపడుతుంది

**ప్రాణ, ఆస్తి నష్టాలకు తావు లేకుండా అధికారులు, నాయకులు సమన్వయం పాటించాలి**

**వ్యవ సాయ సహకార మార్కెటింగ్ శాఖ, డైరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్న నాయుడు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి వైపరీత్యాలు, తుఫాన్లు, వరదలు వంటివి సహజ సిద్ధంగా సంభవిస్తాయని వాటి వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలకు తావు లేకుండా ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా ఇన్చార్జ్, వ్యవ సాయ సహకార మార్కెటింగ్ శాఖ, డైరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్న నాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుఫాన్ తీవ్రత, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ, రహదారులు,రాకపోకలు విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేక అధికారి విజయరామరాజు తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఆస్తి ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు, సహాయక చర్యలను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సూచించారన్నారు. జిల్లాలో ఇప్పటికే తాడిచెట్టు పడి ఒక మహిళ మరణిం చడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సం ఘటనలు పునరావృతం కాకుండా ప్రజా ప్రతిని ధులు అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రకృతి విప త్తుల పట్ల వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తూ, నష్టాల తీవ్రతను తగ్గించడంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు అపార అనుభవం ఉందని, హుదూద్ వంటి పలు తుఫానుల ధాటి ఎదుర్కొన్నారని, అదే స్ఫూర్తితో మొంథా తుఫాన్ తీవ్రత వల్ల జరిగే నష్టాలను పూర్తిగా నివారించి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని అధికారులను ఆదేశించారు. పూరి గుడిసెలు, పక్కా గృహాలు సముద్ర తీరానికి ఒక కిలోమీటర్ పరిధిలో నివాసముంటున్న వారందరినీ పున రావాస కేంద్రాలకు తరలించాలన్నారు. చాలా మంది ఇల్లు విడిచి బయటకు రావడానికి ఇష్ట పడరని, అయినప్పటికీ వారి యోగక్షేమాలను కోరుతూ బలవంతంగా నైనా తరలించాలన్నారు. మొంథా తుఫాను మంగళవారం సాయంత్రం 5 గంటలు రాత్రి 10 గంటల మధ్య రాజోలు సమీప ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించినట్లు మంత్రి తెలిపారు. జిల్లా ప్రజానీకానికి టైం టు టైం వరద హెచ్చరికల సమాచారాన్ని అందిస్తూ, అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈదురుగాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోందని ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. అందరినీ పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి బుధవారం సాయంత్రం వరకు పునరావస కేంద్రాలలో ఆశ్రయం కల్పించి రాత్రి భోజనం అనంతరం తిరిగి ప్రభుత్వం ప్రకటించిన రూ 3 వేల ఆర్థిక సహాయాన్ని, మత్స్యకార నిర్వాసితులకు ఉచితంగా 25 కేజీల బియ్యాన్ని అందించి బాధితులను ఇంటికి పంపించాలన్నారు. ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సూచనలతో జనరేటర్లు అవసరమైన చోట ఏర్పాటు చేసుకొని వాటికి అవసరమైన డీజిల్ కూడా సరఫరా చేస్తామన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని, జిల్లాలో నిరాశ్రయులైన వారందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. తుఫాన్ అనంతరం రోడ్లపై పడిపోయిన చెట్లు తొలగిస్తూ, రాకపోకలు, అదేవిధంగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు నెలకొల్పి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు జి.హరీష్ మాధుర్, స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసనస భ్యులు దాట్ల సుబ్బరాజు, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ కే మాధవి, ఆర్ అండ్ బి ఆర్ డబ్ల్యు ఎస్, అగ్నిమాపక విపత్తుల స్పందన, పంచాయతీ రాజ్ విభాగాల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన



**కాకినాడ/తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఇతర అధికారులతో కలిసి కాకినాడ పట్టణం ఏటిమొగ, దుమ్ములుపేటబీ పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, తాళ్ళరేవు మండలం గాడిమొగ ఇతర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కాకినాడ పట్టణంలో పునరావాసక కేంద్రాలకు తరలించిన ప్రజల కోసం కాకినాడ సూర్యకళామందిరం ప్రక్కన సిద్ధం చేసిన భోజన పదార్థాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం దుమ్ములుపేట తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజల కోసం పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు స్వయంగా మధ్యాహ్నం భోజనం వడ్డించారు. అనంతరం కాకినాడ జిల్లా తాళ్ళరేవు గాడిమొగ ధీరుబాయ్ అంబానీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు భోజన పదార్థాలు వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 18 మండలాల్లో 67 గ్రామాలు, 5 పట్టణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేమన్నారు. జిల్లా వ్యాప్తంగా 401 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయగా, ఇప్పటికే 76 కేంద్రాలు ప్రారంభించా మన్నారు. కాకినాడ పట్టణంలో 16 పునరావాస కేంద్రాల్లోకి లోతట్టు ప్రాంత ప్రజలను తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారయంత్రాంగం పునరావస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, అధికారులతో సహకరించి, ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాను కారణంగా మంగళవారం సాయంత్రం నుంచి అధిక వర్షాలు, అధిక వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు పునరావాస కేంద్రాలను విడిచి వెళ్ళరాదన్నారు. తీరం సమీపిస్తున్న కొద్ది తుఫాను తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలు బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. ఈ పరిశీలనలో కాకినాడ కమిషనర్ కెపీ.సుధాకర్, జిల్లా కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ. వెంకటలక్ష్మి, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, తాళ్ళరేవు తహసీల్దార్ పి.శ్రీనాథరావు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లా సమీక్ష సమావేశం - మంత్రికి కందుల అధ్యక్షతన నిర్వహణ**

**జిల్లా అధికార యంత్రాంగా నికి,ప్రజలకు పల సూచనలు చేసిన మంత్రి**

**రానున్న మూడు రోజుల పాటు అధికారులు 24ఐ7 విధుల్లో ఉండాలని ఆదేశాలు జారీ..**

**విపత్తు నిర్వహణ ఎదుర్కొనేందుకుయువతకు శిక్షణ ఇచ్చి ఆ బృందాలను గ్రామాల్లో సేవలందించేలా చర్యలకు సూచన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తతతో ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా తూర్పు గోదావరి జిల్లా అధికారులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "విపత్తు ముందు, విపత్తు తర్వాత అధికారులు పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉండాలి. రహదారులపై గండ్లు పడటం, చెట్లు కూలడం, ముంపు ప్రాంతాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో 'ఏమీ జరగదు' అనే నిర్లక్ష్య భావం ఉండకూడదు. స్థానిక యువత, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ బృందాలతో సమన్వయంగా పనిచేయాలి. ఈ సందర్భంగా విపత్తు నిర్వహణ ఎదుర్కొనే విషయంలో యువతకు శిక్షణ ఇచ్చి గ్రామాల వారీగా బృందాన్ని సిద్ధం చేసుకోవాలి. పశు సంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి శాఖ సమయానికి స్పందించి ప్రజల భద్రతను కాపాడాలి. రానున్న మూడు రోజుల పాటు అధికారులు 24ఐ7 విధుల్లో ఉండాలి. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు ఎదురైనప్పుడు ప్రజల్లోకి సమర్థవంతంగా అవగాహన తీసుకెళ్లేందుకు జిల్లా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం పై దృష్టి సారించాలని మంత్రి దుర్గేష్ సూచించారు. విపత్తు సమయంలో స్పందన, సహాయక చర్యలు, పునరావాసం వంటి అన్ని అంశాలు సమన్వయంతో సాగాలన్నారు.

**అప్రమత్తంగా చర్యలు**

**జిల్లా సహాయక చర్యల ప్రత్యేక అధికారి కె.కన్నబాబు**

జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు మాట్లాడుతూ "ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువలలో నీటి ప్రవాహ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైతే రిజర్వాయర్ల దిగువకు నియంత్రితంగా నీటిని విడుదల చేయాలి. రహదారులపై గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి. వానరబుల్ ఏరియాస్ గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు సిద్ధం చేయాలి. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా అన్ని విభాగాల సమాచారాన్ని సమీకరించి విపత్తు నిర్వహణ యంత్రాంగం అందుబాటు లో ఉంచినట్లు తెలిపారు. గాలి వేగంగా వీచే అవకాశం ఉన్నందున విద్యుత్, టెలికం శాఖలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అవసరమైతే డ్రోన్ టెక్నాలజీ ద్వారా మందులు, ఆహార సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు."

**ప్రజల భద్రత మా ప్రాధాన్యత : కలెక్టర్ కీర్తి చేకూరి**

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ "తుఫాన్ తీరం దాటే సమయంపై ఖచ్చితమైన సమాచారం కోసం వాతావరణ శాఖ సూచనలను ప్రతి నిమిషం అనుసరించాలి. ఏ సమయంలోనైనా ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ఎస్ ఓ పి ప్రకారం శాఖల వారీగా చర్యలు అమలు చేయాలి. ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో అప్రమత్తత సూచనలు ఇచ్చాం. పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాం. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాం. అవసరమైన ఆహారం, త్రాగునీరు, డ్రై రేషన్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాం. రక్షణ చర్యలన్నీ డాక్యుమెంటేషన్ రూపంలో నిర్వహించాలని సూచించాం. పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు."

**అప్రమత్తంగా ఉండాలి**

**పోలీస్ సూపరింటెండెంట్ డి.నరసింహ కిషోర్**

ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ "తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు పహారా విధులు కట్టుదిట్టం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లకు సూచనలు జారీ చేశాం. ఎస్డిఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలి. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలి. కంట్రోల్ రూమ్‌లు 24ఐ7 పనిచేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించేందుకు బృందాలు సిద్ధంగా ఉన్నాయి" అని తెలిపారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ "కొత్త చెరువు వద్ద 10 ఏళ్ల క్రితం గండి పడిన ప్రాంతంలో ముందస్తు చర్యగా 1000 ఇసుక బస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేశాం. క్రాప్ కోతకు సంబంధించిన ముంపు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకున్నాం" అని తెలిపారు. ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ మాట్లాడుతూ"పునరావాస కేంద్రాల్లో వేడిగా ఆహారం అందుబాటులో ఉంచాం. మైనర్ ఇరిగేషన్ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామమూర్తి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె భాస్కర్ రెడ్డి, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, ఎన్డిఆర్ఎఫ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్


# ప్రకృతి వైపరీత్యాలు విధ్వంసం

1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకులం చేసిన తుఫాను, ప్రకృతి ప్రతాపానికి నిదర్శనంగా మిగిలింది. ఈ తుఫాను అత్యంత శక్తిమంతమైనదిగా పరిగణించబడుతుంది. అధిక వేగంతో వీచిన గాలులు, భారీ వర్షాలు, తీరప్రాంతాల్లో భారీ అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వేల మంది మృతి చెందగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వ్యవసాయ భూములు, ఇళ్ళు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తీరప్రాంత వృక్షసంపద, జీవవైవిధ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, పునర్నిర్మాణానికి ఎంతో కాలం పట్టింది. ఆర్థిక నష్టం అంచనాకు అందనిది. 1971లో ఒడిషాను (అప్పటి ఒరిస్సా) అతలాకుతలం చేసిన తుఫాను భారత దేశంలో ప్రకృతి వైపరీత్యాల ప్రతాపాన్ని చాటిచెప్పింది. ఈ తీవ్ర తుఫాను వల్ల ఊహాతీత విధ్వంసం జరిగింది. తుఫాను ఉప్పెన ఒడిశా తీరంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది, 10,000 మందికి పైగా మరణించారు. 50,000 పశువులు చని పోయాయి. వందల వేల చెట్లు నేలకూలాయి. తుఫాను 800,000 కంటే ఎక్కువ ఇళ్లను ధ్వంసం చేసింది. రోజుల తరబడి కమ్యూనికేషన్లు, విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విపత్తు వార్త బయటి ప్రపంచానికి అందకుండా చేశారు. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయి, లక్షలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఈ తుఫానుతో భారీ వర్షాలు, 300 కి.మీ.ల వేగంతో వీచిన గాలులు, తీరప్రాంతాల్లో అతిపెద్ద అలలు తీరని విధ్వంసాన్ని సృష్టించాయి. వ్యవసాయ భూములు, ఇళ్ళు, తీరప్రాంతంలో ఉన్న వృక్ష సంపద, జీవవైవిధ్యం తీవ్రంగా నష్టపోయాయి. ఒడిషా ఆర్థిక వ్యవస్థ ఈ తుఫాను ప్రభావం నుంచి కోలుకోవడానికి సంవత్సరాల సమయం పట్టింది. ఈ సంఘటన అనంతరం, విపత్తుల నిర్వహణలో ముందస్తు చర్యలు, అవగాహన, పునర్నిర్మాణ ప్రణాళికలు ఎప్పటికప్పుడు ముమ్మందుకు రావాల్సిన అవసరం స్పష్టమైంది. ప్రకృతి వైపరీత్యాలు అంటే ప్రకృతి సృష్టించే భారీ సంఘటనలు, ఇవి పర్యావరణాన్ని, జీవసారాన్ని, ప్రజల ఆస్తి, ప్రాణాల్ని ప్రభావితం చేస్తాయి. తుపానులు, వరదలు, భూకంపాలు, సునామీలు, కరువు, అగ్నిపర్వతాలు వంటి విపత్తులు మనకు పెద్ద ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కాకుండా మానవ చర్యల వల్ల కూడా విపత్తులు సంభవిస్తాయి. ఉగ్రవాదం, యుద్ధాలు, అణు బాంబులు, పరిశ్రమల కాలుష్యం వంటి మానవ నిర్మిత విపత్తులు మన భద్రత, ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇవి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారడంతో పాటు, పర్యావరణాన్ని కూడా నాశనం చేస్తాయి. భారతదేశంలో ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తూనే ఉన్నాయి. ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్ ప్రకారం గత మూడున్నర దశాబ్దాల్లో భారత్‌లో దాదాపు 431 రకాల ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఈ విపత్తుల వల్ల 1,43,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 15 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావానికి గురయ్యారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, ఈ విపత్తుల కారణంగా భారతదేశ జాతీయ ఆదాయంలో ఏటా సుమారు 2.25 శాతం నష్టం సంభవిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం, 20 సంవత్సరాల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు భారతదేశంలో సుమారు 7,950 కోట్ల డాలర్ల నష్టాన్ని కలిగించాయి. ప్రకృతి విపత్తులను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, ముందస్తు సన్నాహాలు మరియు విపత్తు నిర్వహణ ద్వారా వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చు. సహాయ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ప్రజలలో అవగాహన పెంపొందించాలి. విపత్తుల నిర్వహణ కోసం పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి ముందడుగు వేయాలి. విపత్తులకు ముందుగానే పునరుద్ధరణ ప్రణాళికలు తయారు చేయడం, ప్రజలకు శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయడం వంటి చర్యలు అవసరం. ప్రపంచవ్యాప్తంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఇంటర్‌నెట్‌ను ఇం'ధనం'గా వాడుకుందాం



నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్–ఏఐ యుగం వరకు మానవ జీవనశైలిలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ–మెయిల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, గూగుల్, ట్విట్టర్, వాట్స్‌యాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి పదాలు చిన్న పిల్లలకు సహితం కంఠస్థం అయ్యాయి. కంప్యూటర్ వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచార వితరణ సుసాధ్యం చేయడాన్ని ఇంటర్నెట్‌గా చెప్పుకుంటున్నాం. 'ఇంటర్–కనెక్టెడ్ నెట్‌వర్క్'ను 'ఇంటర్నెట్' అంటున్నాం. ప్రపంచ మానవాళి అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలిసింది. గూగులమ్మ పొట్టలో విశ్వ విజ్ఞానం అంతా దాగి పోయింది. అడిగిందే తడవుగా సమాచారాన్ని మనకు వడ్డిస్తోంది. నేటి "వరల్డ్ వైడ్ వెబ్'ను 1989లో "టిమ్ బెర్నర్ – లీ"లు కనుగొన్నా. పట్నం మేధావి నుంచి పల్లె నిరక్షరాస్యుడి వరకు అందరికీ ఇంటర్నెట్ ఆత్మీయ నేస్తం అయ్యింది. 29 అక్టోబర్ 1969 రోజు తొలిసారి కాలిఫోర్నియా యూనివర్సిటీలో 'చార్లీ క్లైన్'తో కలిసి 'లియొనార్డ క్లీన్‌రాక్' 'ఎల్', 'ఓ' (లాగిన్) అనే ఆంగ్ల అక్షరాలను ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వారా విజయవంతంగా పంపించడం జరిగింది. ఆధునిక మానవుడు అంతర్జాల లేదా ఇంటర్నేట్ సంద్రంలో మునిగి తేలుతున్నాడు. ఇంటర్నేట్ వాడకుండా ఒక గంట గడవడం లేదు. స్మార్ట్‌ఫోన్ మానవ శరీరంలో మరో ఆధునిక అంగం అయ్యింది. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. విశ్వాన్ని కుగ్రామంగా మార్చిన ఘనత ఇంటర్నెట్ టెక్నాలజీదే అని నమ్ముతున్నాం. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అంతర్జాలాన్ని వినియోగిస్తున్న నెటిజెన్లు అనేక ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ పలు సందర్భాల్లో ప్రతికూల అనుభవాలు, సైబర్ బుల్లీయింగ్, తిట్ల దండకాలు, అక్రమ వినియోగాలు, అసభ్యకర అవమానకర మాటలను కూడా వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. ఆ సృజనశీల ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 29 అక్టోబర్ రోజు ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ అంతర్జాల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే)" పాటించడం 2005 నుంచి ప్రారంభం అయ్యింది. నేటి 'ఇంటర్నెట్'ను ప్రారంభంలో 'ఆర్పినెట్' అని పిలిచే వారు. నేటి డిజిటల్–ఏఐ యుగంలో ఇంటర్నెట్‌ను "ఇన్ఫర్‌మేషన్ సూపర్ హైవే" అని పిలవాల్సిన స్థితి రావడం చూస్తున్నాం. ఇంటర్నెట్‌ను శోధించడాన్ని 'సర్ఫింగ్' అని, ఇంటర్నెట్ వినియోగదారులను 'నెటిజెన్' అని, వీడియో కాన్ఫరెన్స్‌ను 'వెబినార్' అని పిలుస్తున్నాం. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు 0.2 సెకన్లలో సమాధానాలు పొందుతున్నాం. 1971లో ఈ–మెయిల్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998సో గూగుల్, 2004లో ఫేస్‌బుక్, 2006లో ట్విట్టర్ అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం గూగుల్‌ను "కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్" అని పిలుస్తున్నాం. అంతర్జాల సంద్రంలో మునిగిన నేటి డిజిటల్ మానవుడు ఎలక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డైన్‌లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, ఈ–విద్య, వీడియో గేమ్స్, స్నేహాలు, ఈ–లైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక – బ్యాంకింగ్ సేవలు, సమాచార వితరణ, వర్క్ ఫ్రం హెూమ్, విజ్ఞాన బోధన, లాంటి అనేక ప్రయోజనాలను పొందుతున్నాడు. నేడు విశ్వవ్యాప్తంగా 5.56 బిలియన్ల అంతర్జాల వినియోగదారులు, 5.28 బిలియన్ల స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, ఇంటర్నెట్ వాడుకునే 68 శాతం ప్రపంచ ప్రజలు ఉన్నారు. నేడు అత్యధికంగా చైనాలో 975 మిలియన్లు, భారత్‌లో 806 మిలియన్లు, యూఎస్‌లో 322 మిలియన్ల అంతర్జాల వినియోగదారులు ఉన్నారు. ప్రతి ఏట ఒక మిలియన్ ఇంటర్నెట్ వినియోగదారులు కొత్తగా చేరుతున్నారు. నేడు ఇంటర్నెట్ సగటు వినియోగం 6 గంటల 42 నిమిషాలు, సోషల్ మీడియా సగటు వినియోగం 2 గంటల 16 నిమిషాల సమయం పడుతున్నది. నిత్యం దాదాపు 350 బిలియన్ల ఈ–మెయిల్స్ పంపడం జరుగుతున్నది. అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 11 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే"పాటించడం కూడా ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి. ఇంటర్నెట్‌తో ఎంతో ప్రయోజనం పొందుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంతర్జాల వలలో చిక్కి జీవితాలు సర్వనాశనం కూడా కావచ్చని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. అంతర్జాల వలయంలో అధిక సమయం మునిగితే ఓపిక నశించడం, ఒంటరితనం, నిద్రలేమి, అనారోగ్య సమస్యలు, కంటి చూపుపై దుష్ప్రభావం, ఏకాగ్రత లోపించడం, దుర్వార్తలను ప్రేరేపించడం, అశ్లీల సైట్స్‌తో భవిష్యత్తు సర్వనాశనం, పనిలో శ్రద్ధ తగ్గడం, స్థూలకాయ సమస్యలు, సైబర్ నేరాలు లాంటివి కలుగుతున్నాయి. ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గ్రూమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్‌టింగ్, రాన్‌సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహనలేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి. తగు విధంగా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఇంటర్నేట్‌ను సురక్షితంగా వాడడం నేర్చుకొని భద్రంగా అంతర్జాల వలలో ఆనంద తాండవం ఆడుదాం, విజ్ఞాన వివేకాలను పొందుదాం, ఆన్‌లైన్ మోసగాళ్లకు ముచ్చెమటలు పట్టిస్తూ వారి భరతం పడదాం. ఇంటర్నెట్‌ను విశ్వ మానవాళి ప్రయోజనాలకు వినియోగిస్తూ, అన్ని రంగాల్లో ముందడుగు వేద్దాం.

# మానవాళికి పట్టిపీడిస్తున్న అవినీతి

ఎక్కడ, ఎప్పుడూ చూసినా అవినీతి దుర్వాసనలు గుప్పుమంటున్నాయి. అనాదిగా స్థానిక సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల వరకు అన్ని విభాగాల్లో/స్థాయిల్లో అవినీతి భూతం రెచ్చిపోతున్నది. వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రుల వరకు అన్ని విభాగాల్లో ఆయా స్థాయిలో అవినీతి చెదలు దేశ శ్రేయస్సును భోంచేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని కావాలంటే అమ్యామ్యాలు ముట్టచెప్పాల్సిన అనివార్య అగత్యం ఏర్పడింది. అక్రమార్జనలకు అంతు లేకుండాపోతున్నది. అవినీతి నిరోధక శాఖలు ప్రతి రోజు ఏదో ఒక అవినీతి చేపను వలపన్ని పట్టుకుంటున్నది, తర్వాత అవినీతికి తలవంచి వదిలేస్తున్నది. స్కామ్‌లు, లంచాలు నిత్యకృత్యం అయ్యాయి. ప్రభుత్వ శాఖలో పని జరగాలంటే ముట్టచెప్పాల్సిందే అని ప్రజలు దృఢ అభిప్రాయానికి వస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పెంచి పోషిస్తున్న యంత్రాంగాలు, ఆహార సరుకుల కల్తీల లీలలు, నాణ్యతకు తిలోదకాలిస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు, పట్టపగలే లంచాలు తీసుకుంటున్న ప్రబుద్ధులు మన ముందు కాలరెగిరేస్తూ కార్లల్లో షికార్లు కొడుతున్నారు. మనిషిలో నైతికతకు గండి పడితే అవినీతి వరదలు ప్రవహిస్తాయని తెలుసుకోవాలి. అవినీతి చెదలుకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం విజిలెన్స్ లేదా అప్రమత్తత విభాగాలను ఎన్ని ఏర్పాటు చేసినా ఆయా శాఖల స్వయం ప్రతిత్తికి భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ప్రబుద్ధుల్లో చిత్తశుద్ధి లోపించి అనవసర స్వార్థ పూరిత జోక్యంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా అక్రమార్కులు విర్దిల్లడం విచారకరం. భారత కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లో పని తీరును మెరుగు పరచడం, పారదర్శకత పెంచడం, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, పిర్యాదుల విభాగాలను బలోపేతం చేయడం, ఆరోపణలు గుప్పుమన్నపుడు వెంటనే నిష్పాక్షిక విచారణ జరపడం, విజిలెన్స్ విషయంలో అత్యాధునిక డిజిటల్ సదుపాయాలను వినియోగించుకోవడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 27 అక్టోబర్ నుండి 02 నవంబర్ వరకు "విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు లేదా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్"ను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసింది. ఈ వారోత్సవాల్లో భాగంగా దేశ సమగ్రతను కాపాడడం, అవినీతి నిర్మూలన, బంధు ప్రీతి చూపడం, పక్షపాతాన్ని పెంచి పోషించడం, లంచం ఇవ్వడమా కాదు లంచాన్ని తీసుకోవడం కూడా నేరమని అవగాహన పర్చడం కొనసాగుతున్నది. నవ భారతదేశాన్ని నిర్మించడానికి మన జీవితాల్లో నైతిక విలువలను పెంపొందించడం, ప్రోత్సహించడం అత్యవసర మని అవగాహన కల్పించడం కొనసాగుతున్నది. 'విజిలెన్స్: మన సమిష్టి బాధ్యత (విజిలెన్స్: అవర్ షేర్డ్ రెస్పాన్సిబులిటీ)" అనే థీమ్‌ను తీసుకొని ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నది. భారత రత్న సర్దార్ వల్లబ్‌బాయ్ పటేల్ జన్మదినాన్ని (31 అక్టోబర్) పురస్కరించుకొని ప్రతి ఏట విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి 'భారతీయుడు' అప్రమత్తంగా ఉండాలని, ఎల్లవేళల నిజాయితీ/చిత్తశుద్ధి అత్యున్నత ప్రమాణాల్లో ఉండాలని, అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనాలని ప్రజలను కోరుతున్నారు. 'సంతానం కమిటీ" సిఫార్సుల ఆధారంగా దేశ సమగ్రత కాపాడడం, పారదర్శకత పెంచడం, జవాబుదారీతనాన్ని అమలు చేయడం, అవినీతి నిర్మూలన లాంటి ధ్యేయాలతో 1964లో భారత ప్రభుత్వం 'సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ లేదా సివిసీ' అనబడే అత్యున్నత ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసింది. విజిలెన్స్ కార్యకలాపాల్లో సున్నితమైన ప్రాంతాల్లో సిబ్బంది పర్యవేక్షణ, పిర్యాదుల విచారణ, దుష్ప్రవర్తనలకు ఆస్కారం లేకుండా విధుల నిర్వహణకు సలహాలు ఇవ్వడం, కాంట్రాక్టుల పర్యవేక్షణ/ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం లాంటి ప్రధాన విధులతో సివిసీ, ఇతర విజిలెన్స్ శాఖలు పని చేస్తున్నాయి. విజిలెన్స్ అవగాహన వారోక్సవాల్లో భాగంగా విద్యాలయాల్లో నైతిక ప్రవర్తన ప్రాధాన్య అంశాలను తీసుకొని పలు పోటీలను నిర్వహించడం, విజిలెన్స్ విభాగాలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, నైతిక ప్రవర్తన ప్రదర్శించిన సిబ్బందిని సన్మానించడం, విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞను సామూహికంగా చేయించడం, దేశ శ్రేయస్సు కోరి నీతి నిజాయితీలను పెంచి పోషించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రాజకీయ నాయకుల్లో నైతిక ప్రవర్తన పెరిగితే ప్రభుత్వ శాఖల్లో కూడా అవినీతి తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేడు మెజారిటీ ఎంఎల్ఎ, ఎంపీలు అవినీతి ఆరోపణల అభియోగాలను ఎదుర్కొంటున్నారు. దీపావళి పర్వదిన వేళల్లో మన జీవితాల్లో వెలుగులు ప్రసరించడానికి నైతిక సమాజ స్థాపన జరగాలని, ప్రతి ఒక్కరు అసలుసిసలైన 'భారతీయుడు' కావాలని, అవినీతి రహిత భారత కలలను సాకారం చేయడానికి అందరం చేయి చేయి కలిపి అవినీతి అనకొండలను ఆమెడ దూరం తరిమేద్దాం, నీతి నిజాయితీ వర్ధిల్లే సమాజ స్థాపనకు కృషి చేద్దాం.

## విద్యార్థులలో నైతికత నశించిందా!

రోజు రోజుకు విద్యార్థులలో ప్రవర్తన, వేషధారణ వింతగా కనిపిస్తోంది. వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ లేకపోవడం వల్లనే గురువులతో, పెద్దవారితో, అటు తల్లిదండ్రులతో ఎలా మాట్లాడాలో, ఎలా నడుచుకోవాలో, చిన్న వారితో ఎలా ప్రేమగా మెలగాలో తెలుస్తలేదు. సమాజంలో సర్దుబాటు కావడంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే విద్యా ర్థులలో విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర మాత్రమే సరిపోదు. పేరెంట్స్, గ్రాండ్ పేరెంట్స్ పాత్ర కూడా చాలా కీలకమే. తలరాతను సైతం మార్చే శక్తి తరగతి గదిలోని ఉపాధ్యాయులకు ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ నేటి కాలంలో చాలా వరకు పాఠశాలలు ర్యాంకులు తెప్పించు కోవడం కోసం పని చేయించుకోవడం, పని ఒత్తిడి, తక్కువ సమయంలో ఎక్కువ సిలబస్ పూర్తి చేయమనడంతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను మాత్రమే బోధిస్తున్నారు. పాఠ్యాంశాలతో కలిపి విలువలను బోధిస్తలేరు. అనేక విద్యా కమిటీలు అంతర్గతంగా విలువలు బోధించాలని చెప్పిన అది తరగతి గదిలో సరిగా అమలు కావడం లేదు. ఇలానే కొనసాగితే విలువలకు ప్రత్యేకమైన పీరియడ్లు కేటాయించక తప్పదు. అందుకే ఇకనైనా ఉపాధ్యాయులు తరగతి గదిలోని 45 నిమిషాల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాఠంతో అనుసంధానంగా విలువలను కూడా బోధించాలి. ఉరుకు పరుగుల జీవితంలో తల్లి దండ్రులు కాలంతోనే పరిగెడుతున్నారు. పిల్లలకు సకల సౌకర్యాలు కల్పించాలని, విలువైన విద్యను అందించాలని ఆరాటపడుతున్నారు. కానీ విలువలు పెంపొందించడంలో విఫలం అవుతున్నారు. దీనికి కారణం వారు చేసే పనిలో ఒత్తిడి, అధిక భారం, అనేక సమస్యలు చుట్టూ తిరగడం. అయినా ఇవ్వన్ని కాసేపు మర్చిపోయి వారికి దొరికిన కాస్త సమయంలో పిల్లల్ని చేరదీసి వాళ్లతో ప్రేమగా మాట్లాడాలి. సమాజంలో మంచి చెడుల గురించి అర్థమయ్యేలా వివరించాలి. సమయం దొరికినప్పుడల్లా రీల్స్, పనికి రాని వీడియోలు చూసే బదులు వాళ్లకు నీతి కథలు చెప్పాలి. తల్లిదండ్రుల పర్యవేక్షణలో పిల్లలు ఉండాలి. దీనివల్ల పిల్లల్లో క్రమశిక్షణను, విలువలను పెంపొందించవచ్చు. పేరెంట్స్, గ్రాండ్ పేరెంట్స్ అనగానే చాలా మంది అనుకునేది వాళ్లు మనకు ఏ ఆస్తులు అందించారు.. ఏ ఆస్తులు అందించలేదని ఆలోచిస్తారు. కానీ ఆస్తుల కన్నా విలువైన విలువలను అందిస్తున్నారన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. నాటి పిల్లల్లో విలువలుండి, నేటి పిల్లల్లో విలువలు లేకపోవడానికి కారణాలు లోతుగా మనం అధ్యయనం చేసినట్లయితే ఆనాటి కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలు.. ఈ కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రుల కన్నా తాతయ్య, నానమ్మ దగ్గర ఎక్కువ సమయాన్ని గడిపేవారు. దానివల్ల పిల్లలకు సంస్కృతి సాంప్రదాయాలను అందించడమే కాకుండా వారు పిల్లలతో ఓపికగా, ప్రేమగా ఉండి అనేక నీతికథలు చెబుతూ వాళ్లను సరైన దారిలో నడిచే విధంగా చూసేవారు. కానీ నేడు చాలామంది చిన్న కుటుంబాలుగానే జీవిస్తున్నారు. అత్తా కోడళ్ల గొడవలు, ఆస్తుల విషయంలో మనస్పర్థలు, ఇంకా ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిపోవడంతో గ్రాండ్ పేరెంట్స్ నుండి మన పిల్లలు విడిపోతున్నారు. గ్రాండ్ పేరెంట్స్ నుండి పిల్లలే దూరం అవుతున్నారని మనం అనుకుంటున్నాం.. కానీ విలువలకు కూడా దూరం అవుతున్నారు అని మనం ఆలోచించలేక పోతున్నాం. అందువల్ల మన పిల్లలని మన తల్లి దండ్రుల దగ్గర ఉండే విధంగా చూడాలి

# ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదు

## ఓడలరేవులో పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, ఫిషరీస్, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజవర్గం అల్లవరం మండలంలోని ఓడలరేవు గ్రామంలో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండటం వలన పునరావాస శిబిరాలను మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓడలరేవు సముద్ర తీర ప్రాంతాన్ని, సైక్లోన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు, ఎంపీ హరీష్ మాధుర్, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు యాళ్ళ దొర బాబు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, పెచ్చెట్టి చంద్ర మౌళి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పురావాస శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ సహాయక చర్యలను స్వయంగా ఆయనే పరిశీలించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు.ముందస్తు రక్షణ చర్యలుగా తుపాను ముప్పు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పునరావాస కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త మల్లాడి ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు కొల్లు విష్ణు మూర్తి, కోప్పడి వెంకట రామకృష్ణ, రేకాడి శేషగిరి, గుండుమెను శ్రీను, జనసేన నాయకులు గంగాభవాని, పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### తుఫాను బాధితులకు

# ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది

## రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్





**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాను ప్రభావంతో నష్టపోయిన బాధితులను, రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. తుఫాను కారణంగా వీచిన బలమైన గాలులకు కాజులూరు మండలం కోలంక, గొల్లపాలెం గ్రామంల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ జనసంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అదే సమయంలో కోలంక రోడ్లో ప్రయాణిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అప్రమత్తమై అధికారులను పిలిపించి దగ్గరుండి, చెట్టును తొలగించే కార్యక్రమం చేపట్టారు. మంత్రి దగ్గరుండి సహాయకచర్యల్లో పాల్గొనడంతోహుటాహుటిన అధికార యంత్రాంగం యంత్రాలతో చెట్లను తొలగించారు. అలాగే గొల్లపాలెంలో కూడా చెట్లు కూలడంతో మంత్రి సుభాష్ అధికారులను అప్రమత్తం చేసి దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం మంత్రి మండలంలోని పలు పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు. విపత్కర పరిస్తితులను ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# మొంథా ముప్పును సమర్థవంతంగా తప్పించాలి


## ప్రాణ, ఆస్తి నష్ట నివారణకు సమర్థ ప్రణాళికలు : ప్రత్యేక అధికారి విజయరామరాజు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిసర తీర ప్రాంతాలలో మంగళవారం రాత్రికి మొంథా తుఫాను తీరం దాటనుందని, జిల్లా మొంథా తుఫాన్ సహాయక చర్యల ప్రత్యేక అధికారి వి.విజయరామరాజు వెల్లడించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ నుండి ఆయన గ్రామ సచి వాలయ స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మొంథా తుఫాన్ ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధత సహాయక చర్యల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయరామరాజు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతానికి ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న కచ్చా గృహాలు, పక్కా గృహాలలో నివసిస్తున్న వారిని మధ్యాహ్నం రెండు గంటల లోపుగా పోలీస్ సిబ్బంది సహకారంతో బై ఫోర్సును వినియోగించి, తప్పనిసరిగా మ్యాపింగ్ చేసిన పునరావాస కేంద్రాలకు తరలిస్తూ ప్రాణ ఆస్తి నష్టాలను పూర్తిగా నివారించాలని అన్నారు. ప్రతి పునరావస కేంద్రానికి కేటాయించిన ఇన్చార్జి అధికారి నాణ్యమైన ఆహారం, అన్ని రకాల ఔషధాలతో మెడికల్ క్యాంపులు, సురక్షితమైన త్రాగునీరు వంటి కనీస వసతులు కల్పన ద్వారా తాత్కాలికంగా ఆశ్రయం పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. మొంథా తుఫాన్ ముప్పు కోనసీమ జిల్లాకు ఉన్నందున తీరప్రాంత ప్రజలను తక్షణం పునరా వాస కేంద్రాలకు పోలీసుల సహకారంతో తప్పనిసరిగా తరలించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో క్షేత్రస్థాయి అధికారులు తీర ప్రాంత వాసులను అప్రమత్తం చేస్తూ సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలిస్తూ నాణ్యమైన ఆహారాన్ని ఆరోగ్య భద్రత ను కల్పించాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా, ఎక్కడా ఆహారం, తాగునీరు కలుషితం కాకుండా హైజిన్ వంటి అన్ని జాగ్రత్తలను పాటించాలన్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడం జరిగిందని, ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగ మంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుఫాన్ ను సమర్ధవంతంగా ఎదుర్కోవాలన్నారు. తుఫాను తీరాన్ని దాటే ప్రాంతంలో సుమారుగా గంట సమయం పాటు తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. తుఫాన్ అనంతరం ముందుగా రోడ్డు కనెక్టివిటీ కొరకు చెట్లు, స్తంభాలు తొలగించాలని, పవర్ కనెక్టివిటీ నీ విద్యుత్ స్తంభాలను ట్రాన్స్ఫా ర్మర్ల కండక్టర్లు ఏర్పాటు ద్వారా పునరుద్ధరణ కై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో జి ప్లస్ వన్ గృహాలలో ఉన్న వారి తప్ప మిగిలిన సముద్ర తీరానికి కిలోమీటర్ పరిధిలో ఉన్న కచ్చా, పక్కాగృహాల లోని వారు తప్పని సరిగా పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందాలన్నారు. కాట్రేనికోన, ఐ.పోలవరం, సఖినేటిపల్లి, మలికిపురం, ఉప్పలగుప్తం, కొత్తపేట మండలాల నుండి సుమారుగా 7 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరలింపు ప్రక్రియను అధికారులు మధ్యాహ్నం 2 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహాలలో విద్యార్థినీ,విద్యార్థులు నివాసం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ముంపు బాధితుల తరలింపులో ఎటువంటి అలసత్వాన్ని వహించరాదని ఆయన పునరుద్ఘాటించారు. మొంథా తుఫాన్ రిస్క్యూ ఆపరేషన్స్ పునరావాసం వంటి అంశాలలో ఎక్కడ రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం నిర్దిష్ట ఆదేశాలను అందరూ తూచా తప్పకుండా ఆచరించి మొంథా తుఫాన్ ముప్పును సమర్థ వంతంగా ఎదుర్కొనాలని ఆదేశించారు. తుఫాన్ తీరాన్ని దాటే సమయంలో పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. తుఫాన్ తీరాన్ని దాటిన సమయంలో తీర ప్రాంత వాసులు ఎవరు ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్ళ రాదని సురక్షితంగా ఇంటిలోనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీరాన్ని దాటే సమయాన్ని క్షేత్రస్థాయి అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఆ సమయంలో అందరూ సంయమనం పాటించి రాబోయే 48 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను దృష్ట్యా మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధరలు అదుపులో ఉంచాలని ఎడి మార్కెట్‌ని ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఏటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు తుఫాన్ ప్రమాదం ముగిసే వరకు మండల, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి లోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. సహాయక కేంద్రాలలో భోజన, వసతి సదుపాయాలు సక్రమంగా ఉండాలన్నారు ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల నిల్వలు తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమాచార వ్యవస్థ సేవలలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల సమన్వయం తో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, తీర ప్రాంత ప్రజల తరలింపు ఆపరేషన్, పునరావాసం, ఆస్తి ప్రాణ నష్టాలు, రహదారులు పునరుద్ధరణ విద్యుత్ పునరుద్ధరణ వంటి చర్యల ద్వారా మొంథా తుఫాన్ ముప్పును ఎదుర్కొవాలన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులతో పాటుగా సుమారు 150 గ్రామ సచివాలయాల్లో ఉన్న మహిళా పోలీసులతో తీర ప్రాంత గస్తీని నిర్వహించి, సముద్ర తీరంలో ఎవరు సంచరించకుండా చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డిఆర్ఓ కే.మాధవి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం పరిధిలోని 142 పునరావాస కేంద్రాలు

## సంబంధిత అధికారులు ద్వారా పునరావాస కేంద్రాలలోకి వెళ్ళండి : ఆర్డీఓ అఖిల



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి వైపరీత్యములు మొంథా తుఫాను-2025, రామచంద్రపురం డివిజన్ లో భారీ వర్షములు తుఫాను కారణంగా కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలుతో రామచంద్రపురం డివిజనల్ ఆర్డీఓ అఖిల పలు సూచనలు చేశారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి అమలాపురం పరిసర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం వుండటం వలన తుఫాను తీరం దాటే సమయంలో గంటకు సుమారు 80 నుండి 100 కిలోమీటర్ల వేగంతో వర్షం తో కూడిన ఈదుర గాలులు వీచే అవకాశం ఉందని కావున ప్రజలు 6 గంటల తరువాత ఇంట్లో నుండి బయటకు రాకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.తుఫాను నేపథ్యంలో సాయంత్రం 6 నుండి ఉదయం 6 గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కావున ప్రజలు ఇండ్లలో కొవ్వొత్తులు మరియు ఇతర ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసుకొనవలెను తెలిపారు.రామచంద్రపురం డివిజన్ పరిధిలోని అన్నీ మండలలో 142 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడమైనదని, ఈ సమయంలో శిధిలావస్థలో ఉన్న గృహములలో గాని, తాటాకు ఇళ్ళలో గాని లేదా సురక్షితం కానీ ప్రదేశములలో నివసించువారు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి పంచాయితీ సెక్రటరీ లను సంప్రదించి వారి ద్వారా పునరావాస కేంద్రాలకు చేసారుకోవాలన్నారు. తుఫాను సంబంధిత సహాయ సమాచారం నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని అందుకు రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ కార్యాలయము నందు కంట్రోల్ రూమ్ ఫోను నెంబరు 08857-245166 సంప్రదించాలని ఆర్డీఓ అఖిల అన్నారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో ఉన్న పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం పరిశీలించారు. ఆనందరావు మాట్లాడుతూ ప్రజలు అందరూ అప్రమత్తం గా ఉండాలని సూచించారు. అలాగే ప్రజలకు సరిపోయే నిత్యవసర సరుకులు అన్ని అందుబాటులో ఉన్నాయి, ఎవరు ఎటువంటి ఇబ్బంది పడకూడదు అని అధికారులకు ఆయన సూచించారు. ప్రజలు అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే ఆనందరావు ప్రజలను కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అంతా ఆర్‌డిఓ కార్యాలయంలో కూర్చుని ఎప్పటికప్పుడు అంతా పర్యవేక్షిస్తామని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని ఎవరు ఆందోళన చెందవద్దని అలాగే ఈ తుఫాన్‌పై నిర్లక్ష్యంగా ఉండవద్దని ప్రజలకు, అధికారులకు ఆయన సూచించారు. తుఫాన్‌ను ఎదుర్కోడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.ఆయన వెంట బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు యాళ్ళ దొరబాబు, గంధం పల్లంరాజు, అల్లాడి స్వామి నాయుడు, అధికారులు, గ్రామ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావంపై ఆందోళన చెందక, సమిష్టిగా ఎదుర్కోవాలి



## రాయవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వేగుళ్ళ - మండల తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్‌తో వి.సిలో మాటామంతీ పునరావాస కేంద్రాల ఏర్పాట్లపై పలు సూచనలు - బాధితులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించిన డిఎస్పీ, సిఐ - అధికారులు, కూటమి నాయకుల సమన్వయంతో ఏర్పాట్లు

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మొథా తుఫాను ప్రభావం దృష్ట్యా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలకు కలిపి 12 పునరావాస కేంద్రాలలో మంగళవారం నాటికి 691 మంది బాధితులకు ఆశ్రయం కల్పించి,భోజన,వైద్య, త్రాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ఆటంకం ఏర్పడకుండా జనరేటర్ లను ఏర్పాటు చేసినట్లు రాయవరం మండల తహశీల్దార్ బి.వి భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత మండల తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో వీడియో సమావేశం లో పాల్గొన్న ఆయన అనంతరం పలు శాఖల అధికారులతో కలిసి పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి బాధితులతో మాట్లాడి అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసారు. బాధితుల లో అధికంగా వృద్ధులు,చిన్న పిల్లలు ఉన్నందున సమయానికి ఆహారం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు అందేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించి, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయవరం మండలం వ్యాప్తంగా ఆశ్రయం పొందుతున్న బాధితులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసామని, తుఫాను తీవ్రతకు తీవ్రతకు భయపడక సమిష్టి గా నిలబడదామని ధైర్యం చెప్తూ, నిరాశ్రయులెవరైనా ఉంటే వారిని దగ్గరలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని కూటమి కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాయవరం మండల తహశీల్దార్ బి.వి భాస్కర్, ఎంపీడీవో కీర్తి స్పందన, మండల విద్యాశాఖాధికారి వై సూర్యనారాయణ, డివైఈవో రామలక్ష్మణ మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు వి శాంతి సునీత, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, తెదేపా సీనియర్ నాయకులు ఉండవల్లి రాంబాబు, ఎస్.ఎం.సి చైర్మన్, జనసేన సీనియర్ నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావులు ఉన్నారు. అనంతరం మండల తహశీల్దార్ బి.వి భాస్కర్, ఎంపీడీవో కీర్తి స్పందన, విద్యాశాఖాధికారులు స్థానిక కూటమి నాయకులు వుండవిల్లి రాంబాబు, దేవిశెట్టి కోటేశ్వరరావు లతో కలిసి బాధితులకు మధ్యాహ్న భోజన వితరణ ను చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలైన యు.టి.ఎఫ్ సభ్యులు బాధితులకు బిస్కెట్ ప్యాకెట్ లను అందించి సహకరించారు.

**పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన డిఎస్పీ, సి.ఐలు**

మండలం కేంద్రమైన రాయవరం లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని రామచంద్రపురం డిఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సిఐ పి.దొరరాజులు రాయవరం ఎస్సై డి.సురేష్ బాబుతో కలిసి సందర్శించారు. తొలుత బాధితులను పరామర్శించిన సిఐ పి.దొర రాజు అంతర్రాష్ట్ర కూలీలతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి అందించే సౌకర్యాలను, మెడికల్ సహాయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. తదుపరి పునరావాస కేంద్రానికి చేరుకున్న డిఎస్పీ రఘువీర్ పునరావాస కేంద్రంలోని గదులు, సౌకర్యాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, అధికారులు జనరేటర్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాయవరం గ్రామ కూటమి నాయకులు, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్ | VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
బుధవారం, 29 అక్టోబర్ 2025
www.viswamvoice.com


## పిఠాపురం మొంథా తుపానుపై
# ఉపముఖ్యమంత్రి అప్రమత్తం

◆ ఉప ముఖ్యమంత్రి నిరంతర దిశానిర్దేశం ◆ పకడ్బందీగా సహాయక చర్యలు
◆ పునరావాస శిబిరాల్లో ఆహారం, తాగు నీరు, పాలు, మందులతోపాటు జనరేటర్లు ఏర్పాటు
◆ 34 మంది సభ్యులతో ఎన్డీఆర్ఎఫ్ బృందం సిద్ధం ◆ తీర ప్రాంత గ్రామాల్లో ప్రత్యేక అధికారులతో పర్యవేక్షణ
◆ గంట గంటకు కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గం పరిస్థితిని సమీక్షిస్తున్న పవన్ కళ్యాణ్



**పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంపై తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సర్వ సన్నద్ధతతో ఏర్పాట్లు చేశారు. పవన్ కళ్యాణ్ నిరంతరం నివేదికలు విశ్లేషించి అధికార్లతో చర్చిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట తదితర తీర ప్రాంత గ్రామాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. 34 మంది సభ్యులతో ఒక ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పిఠాపురం నియోజకవర్గంలో అప్రమత్తంగా ఉంది. 34 బోట్లు సిద్ధం చేశారు. వీరికి తోడుగా 12 మంది సభ్యుల క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు, 12 మంది గజ ఈతగాళ్ళూ ఉన్నారు. పిఠాపురం కేంద్రంగా ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పని చేస్తోంది.

**అనుక్షణం అప్రమత్తం ...**

కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తో టెలీ కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తూ కాకినాడ జిల్లాలో తుపాను ప్రభావ పరిస్థితులను ఉప ముఖ్యమంత్రి సమీక్షిస్తూ ఉన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంట గంటకు నివేదికలు తీసుకుంటూ ఉన్నారు. జిల్లాతోపాటు పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 25 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడి ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్షిస్తున్నది. ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలను సమకూర్చి, వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా విద్యుత్ స్తంబాలు నేల కూలితే తక్షణమే స్పందించేలా వ్యవస్థను సన్నద్ధం చేయడంతోపాటు 500 స్తంబాలను స్టాండ్ బైగా ఉంచారు. అలాగే పశువులకు ఇబ్బంది లేకుండా అవసరమైన పశుగ్రాశాన్ని కూడా గ్రామాల్లో సిద్ధంగా ఉంచారు. వీటితోపాటు ఆకస్మిక వరదల హెచ్చరిక నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జల వనరుల శాఖ సిబ్బందిని సమాయత్తం చేశారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయం చేసుకొంటున్నారు. పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించేందుకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికార్లను నియమించారు. ఉప్పాడలో బీసీ కార్పోరేషన్ ఈడీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మూలపేట, కోనపాపపేటల్లో డివిజన్ లెవల్ డెవలప్మెంట్ అధికారులను నియమించారు. అమీనాబాద్, అమరవిల్లి లలోనూ ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. పునరావాస శిబిరాల్లో ఉంటున్న ప్రజలకు ఆహారం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డి.డి.ఓ.ను, పెదపూడి తహసిల్దార్లను నియమించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది మొత్తం సహాయక చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ డి.ఇ. ఆధ్వర్యంలో రక్షిత తాగు నీరు ఏర్పాటు చేశారు. పునరావాస శిబిరాల్లో 12,000 మందికి మధ్యాహ్న భోజనం, 15 వేల మందికి రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. 5,000 పాల ప్యాకెట్లు, 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లతోపాటు వాటర్ ట్యాంకర్లను కూడా సిద్ధం చేశారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ సహాయక చర్యలను పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా ఉన్నత అధికారులను సూచించారు.

## మొంథా తుఫాన్‌తో
# ప్రజల అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే సత్య ప్రభ

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం చేపడుతున్న ప్రమాద నివారణ చర్యలను సమీక్షిస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అత్యవసర సేవలను వేగంగా అందించాలనే దిశగా సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యం అని అన్నారు. తుపాను సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, ప్రతి




శాఖా అధికారి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్, త్రాగునీరు, రహదారులు, వ్యవసాయం, ఆరోగ్యం, పశుసంవర్ధక, రెవెన్యూ, పోలీస్ తదితర విభాగాల అధికారులు ఈ సమావేశానికి హాజరై ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర నివేదికలను ఎమ్మెల్యే సమక్షంలో సమర్పించారు. ప్రజలలో అపోహలు, ఆందోళనలు వ్యాపించకుండా అధికారులు సమయానుకూల సమాచారాన్ని అందించాలనీ, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు, వైద్య బృందాలు, అత్యవసర వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సన్నాహాలు చేసిందని, ప్రతి కుటుంబం సురక్షితంగా ఉండేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తుపాను పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలతో పాటు ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్, విద్యుత్, రోడ్లు, పంచాయతీ రాజ్, వ్యవసాయం, ఆరోగ్య, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అప్పనపాలెం వంతెన త్వరలో పూర్తి చేస్తాం : ఎమ్మెల్యే సత్య ప్రభ






**ఏలేశ్వరం, విశ్వం వాయస్ న్యూస్ :** అప్పనపాలెం వంతెనను ఎమ్మెల్యే సత్యప్రభ పరిశీలించారు. ఏలేశ్వరం మండలంలోని అప్పనపాలెం వంతెన ఐదు సంవత్సరాల క్రితం వచ్చిన భారీ వరదలకు కూలిపోయింది. అప్పటి నుండి ప్రజలు రాకపోకలలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సత్యప్రభ అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడమే కాకుండా, సంబంధిత మంత్రులను స్వయంగా కలిసి వంతెన పునర్నిర్మాణం అవసరాన్ని వివరించారు. తుఫాన్ నేపథ్యంలో ఏలేరు జలాశయం నుండి వరద నీరు విడుదల అవుతుండటంతో, వంతెనపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమని, పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు వంతెనపై రాకపోకలను నిలిపివేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని, వంతెన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామనిఆమె తెలిపారు. అధికారులతో కలిసి వంతెన పరిసర ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు తెలియ చేసామన్నారు. ఈ నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా ఏలేశ్వరం పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో, స్థానిక ఎమ్మెల్యే సత్యప్రభ ఏలేశ్వరం రిజర్వార్ జలాశయాన్నికూడా సందర్శించారు. తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, జలాశయ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆమె, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ, ఎగువ ప్రాంతాల నుండి భారీ స్థాయిలో వరద నీరు ఏలేరు జలాశయానికి చేరుతోంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా దాదాపు 5000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది అన్నారు .ప్రజలు లేదా రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదు,అని తెలిపారు.తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం సమన్వయంతో అప్రమత్తంగా పనిచేస్తోందని, నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యేగా తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నప్పటికీ, అధికారులు కూడా సమయానుసారంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె స్పష్టంగా వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకో కోసమే అన్ని విధాలుగా నిరంతరం శ్రమిస్తుంది అనిఆమె అన్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమించేవారు బాబి యాళ్ల జగదీష్ కొమ్ములు కన్నబాబు అంబటి బుజ్జి వెలుగుల కొండల్లో ఏలేశ్వరం మండల ముఖ్య నాయకులు మరి కూటమి సైనికులు పాల్గొన్నారు.

# తుఫాన్ తక్షణ సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

## ఉద్యానవనశాఖ అధికారిణి దివ్యశ్రీ





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అరటి, బొప్పాయి, కూరగాయలు, ఆకు కూరలు తదితర ఉద్యాన పంటలకు సంభవించే నష్టాన్ని నివారించడానికి రైతులు తక్షణమే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏలేశ్వరం, శంఖవరం మండలాల ఉద్యానవనశాఖ అధికారిణి కె.దివ్యశ్రీ రైతులకు సూచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం గౌరంపేట, గొంధి కొత్తపల్లి, మండపం గ్రామాల్లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలోని సాగు క్షేత్రాల్లోని కూరగాయలు, మిరప, బొప్పాయి, కోకో తోటలను శంఖవరం మండలం వ్యవసాయశాఖ అధికారి పడాల గాంధీతో కలిసి మంగళవారం సందర్శించారు. పంటలను, నేల పరిస్థితులను పరిశీలించారు. రైతులకు ముందస్తు చర్యలు, తుఫాను ప్రభావం అనంతరం పాటించ వలసిన పలు జాగ్రత్తలు, సూచనలను దివ్యశ్రీ వివరించారు. అరటి పంట రక్షణ చర్యల్లో భాగంగా గెలలు ఉన్న ఎత్తుగా పెరిగిన అరటి చెట్లకు వెదురు కర్రలు లేదా కలప స్తంభాలతో రెండు వైపులా గట్టిగా తక్షణ ఊతం ఇవ్వాలి. కోతకు సిద్ధంగా ఉన్న గెలలను అవకాశం ఉంటే కోసి సురక్షితమైన ప్రదేశానికి తరలించాలి. గాలి తాకిడిని తగ్గించడానికి ఎండిన, పూర్తిగా వంగిపోయిన పాత ఆకులను జాగ్రత్తగా తొలగించాలి. తోటల్లో నీరు నిలవ ఉండకుండా ఉండేందుకు మురుగు కాలువలను లోతుగా త్రవ్వి సిద్ధం చేయాలిని దివ్యశ్రీ సూచించారు. బొప్పాయి పంట రక్షణ చర్యలుగా పక్వానికి వచ్చిన, పూర్తిగా పెరిగిన బొప్పాయి కాయలను తక్షణమే కోసి భద్రపరుచుకోవాలి. మధ్య వయస్సులో ఉన్న, ఎత్తుగా ఉన్న మొక్కలు గాలికి విరిగిపోకుండా బలంగా కర్రలతో కట్టి మద్దతు ఇవ్వాలి. బొప్పాయి మొక్కల మొదళ్ల వద్ద నీరు నిలవకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. టొమాటో, వంకాయ, బెండ, మిరప వంటి కూరగాయల పంటల రక్షణ చర్యల్లో భాగంగా పంటలలో కోతకు సిద్ధంగా ఉన్న కాయలు, పండ్లను తక్షణమే కోసి సురక్షిత ప్రాంతానికి తరలించాలి. బీర, కాకర, సొర తీగజాతి కూరగాయలు ఉన్న పందిళ్లు గాలికి కూలిపోకుండా స్తంభాలను, తీగలను గట్టిగా కట్టి భద్రపరచాలి. తుఫాను ముందు, తుఫాను సమయంలో ఎలాంటి పురుగు మందులు (ఫంగిసైడ్స్) పిచికారీ చేయవద్దని దివ్యశ్రీ వివరించారు. తుఫాను ప్రభావం మొదలైన తర్వాత పొలాల్లోకి వెళ్లడం ప్రమాదకరమని, రైతన్నలు తమ ప్రాణాలకు, పశువులకు రక్షణ కల్పించుకుంటూ, తుఫాన్ మొదలవ్వక ముందే రక్షణ చర్యలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసారు. నష్టం సంభవించిన తర్వాత సహాయం కోసం ఉద్యాన శాఖ అధికారులను, రైతు సేవా కేంద్ర సిబ్బందిని వెంటనే సంప్రదించాలని పొలాల్లోనూ, గ్రామ రచ్చబండలో వద్ద రైతులకు ఏలేశ్వరం, శంఖవరం మండలాల ఉద్యానవనశాఖ అధికారిణి కె.దివ్యశ్రీ వివరించారు. ఈ క్షేత్ర పరిశీలనలో గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ, శ్యామ్ సుందర్, క్రాంతి, సురేష్ పాల్గొన్నారు.

# తుఫాను నేపథ్యంలో అధికారులు సమీక్ష



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను దృష్ట్యా సముద్ర తీర ప్రాంతాల్లో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించడానికి మంగళవారం ఏలూరు రేంజ్ ఐజి శ్రీ జీవిజి అశోక్ కుమార్, ఐపీఎస్, గ్రేహౌండ్స్ డిఐజి శ్రీ అట్టాడ బాపూజీ, ఐపీఎస్ సముద్ర తీర ప్రాంతాలను సందర్శించారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే ఉప్పాడ, వాకలపూడి పరిసర ప్రాంతాలు పరిశీలించారు. తుఫాను నేపథ్యంలో చేపల వేటకు వెళ్లకుండా చేపల వేటగాళ్లకు హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. తీర ప్రాంత ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేపట్టబడ్డాయి. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా మోహరించబడ్డాయి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసి అత్యవసర సేవలు అందించే చర్యలు చేపట్టబడ్డాయి. 24 గంటల కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పోలీసు శాఖ హెచ్చరికలు సూచనలు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దు. సముద్రతీర ప్రాంతాలకు వెళ్లకూడదు, మత్స్యకారులు సముద్ర యాత్రలు నిలిపివేయాలి. విద్యుత్ తీగలు తెగిపోవడం, చెట్లు కూలిపోవడం వంటి ప్రమాదాలను గమనించిన వెంటనే 100 లేదా 112 నంబర్‌కు సమాచారమివ్వాలి. తుఫాను సమయంలో పుకార్లను నమ్మకూడదు, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలి అన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పోలీసులు, వాలంటీర్లు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైతే తుఫాను ప్రభావిత ప్రాంతాల నుండి ప్రజలను తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. పోలీస్, రెవెన్యూ, ఫైర్ సర్వీసు, వైద్య, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఐజి , డిఐజి, ప్రజలను జాగ్రత్తగా ఉండమని, ప్రభుత్వ సూచనలను పాటించాలని, తుఫాను సమయంలో శాంతంగా ఉండి పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మొంథా తుఫాన్‌కు ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలి : బొడ్డు

## హోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగింపు – శ్రీరంగపట్నం వైద్యశిబిరం పరిశీలన






**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇళ్లకే పరిమితమై ప్రాణాలను పరిరక్షించుకోవాలని రాజమహేంద్రవరం రుడా చైర్మన్ రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగపట్నంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, బాధితులకు అధికారులు ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ప్రజలు మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేయవద్దని, ప్రజలందరూ ఇళ్లకే పరిమితం కావాలన్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిందని, బాధితులను వాటిని ఉపయోగించుకొని ప్రాణాలను పరిరక్షించుకో వాలన్నారు. బాధితులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఆయా గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిందన్నారు. పోలీస్, సచివాలయ సిబ్బంది మండలంలో అప్రమత్తంగా ఉండి భారీ హోర్డింగ్లను, ఫ్లెక్సీలు, పెద్ద బోర్డులను ఇటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, పోలీస్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యక్తి మరణానికి కారణం అయిన ముద్దాయికి జైలు శిక్ష

**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యక్తి మరణానికి కారణమైన వ్యక్తులకు మూడు నెలలు జైలు, ఆరు వేల రూపాయలు జరిమానా విధించిన సంగతి పెద్దాపురం కోర్టులో క్రైమ్ నెంబర్ 139/2019 యు/సెక్షన్ 304ఏ ఐపిసిగా నమోదు కాబడిన కేసు సంబంధించిన వివరాలు ప్రకారం ఈ కేసులో ముద్దాయి అయిన యర్రసాని శ్రీకాంత్ తన మోటార్ సైకిల్ మీద రంగంపేట మండలం గ్రామంకు చెందిన చొల్లంగి వీరబాబు,బొంతు యేసు అనువారిని ఎక్కించుకుని అతి వేగంగా అజాగ్రత్తగా తన వాహనం నడిపి అదుపుచేయలేక ఒక కారు ను వేరే బైక్ ను గుద్దగా బైక్ పై ఉన్న వారిలో చొల్లంగి వీరబాబు మరణించగా బొంతు యేసు కు గాయాలు అయ్యాయి దీని పై రంగంపేట పోలీస్లు కేసు నమోదు చేసి అతివేగంగా దూకుడుతో నడిపి చేసి ఒకరి మరణానికి కారణం అయిన యర్రసాని శ్రీకాంత్ పై కేసు నమోదు చెయ్యగా రంగంపేట ఎస్ ఐ శివ ప్రసాద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల నాగ లీలరోజా బాధితులు తరుపున తన వాదనలు గట్టిగా వినపించడంతో పెద్దాపురం అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముద్దాయికి మూడు నెలలు జైలు శిక్ష లేదా 6 వేలు రూపాయలు జరిమానా విధించారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ పురందేశ్వరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా ముందస్తు చర్యలు తీసుకుందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడానికి అమెరికా వెళ్లిన పురందేశ్వరి తుపాన్ పరిస్థితులపై ఎప్పటి కప్పుడు తెలుసుకుంటు న్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి ముందస్తుగా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.లోతట్టు ప్రాంత ప్రజలు ప్రభుత్వాధి కారులకు సహకరించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎంపీ పురందేశ్వరి సూచించారు. ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలను ప్రజలందరూ పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తద్వారా ఈ విపత్తును కలిసికట్టుగా ఎదుర్కొందా మని ఎంపీ పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలియజేసారు.

# మత్స్యకారులకు చందా సత్రంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆదిరెడ్డి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథ తుఫాన్ నేపథ్యంలో గోదావరిలంకలోని మత్స్యకారులను స్థానిక చందా సత్రం మరియు తుమ్మలోవలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా చందా సత్రంలోని మత్స్య కారులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈరోజు రాత్రి కలుసుకుని వారికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. మత్స్యకా రులకు అవసరమైన ఆహార పదార్థాలు, తాగునీరు, పిల్లలకు పాలు తదితర సౌకర్యాలు అన్ని ఇబ్బంది లేకుండా సమకూర్చాలని అధికారులకు సూచించారు. అలాగే తుమ్మలోవలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలును సందర్శించి అధికారులు,స్థానిక నాయకులకు పలు సూచనలు చేయడం జరిగింది.

# ప్రజలందరూ ఆందోళన చెందవద్దు.. అప్రమత్తంగా ఉండండి...

**– కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది...**

**– తుఫాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల...**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలందరూ ఆందోళన చెందవద్దని అప్రమత్తంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల పినతండ్రి నువ్వుల అంకమ్మ మృతి చెందిన కారణంగా హైదరాబాద్ పర్యటనలో ఉన్నప్పటికీ కూడా తుఫాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తుఫాను యొక్క పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల వారు మరియు పాడైన ఇళ్లల్లో నివసించేవారు ప్రభుత్వం నిర్దేశించిన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఇందు నిమిత్తం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. తుఫాను ప్రభావాన్ని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మరియు మంత్రులు వారందరూ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. రూరల్ నియోజకవర్గం లోని లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ ప్రభుత్వం నిర్దేశించిన సురక్షిత ప్రాంతాలకు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని అన్నారు.

# తుఫాన్ పట్ల సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండండి : బత్తిన

**మండలంలో 23 కంట్రోల్ రూమ్లు – సచివాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు**




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని సచివాలయ సిబ్బంది మొంథా తుఫాన్ కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఆయా గ్రామాల్లో సచివాలయ కార్యాలయంలో సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24 గంటలు అందుబాటులో ఉండాలని మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విశ్వం వాయిస్ న్యూస్ విలేకరితో మాట్లాడుతూ మొంథా తుఫాన్ పట్ల ప్రభుత్వం చాలా అప్రమత్తమై, ప్రజల ప్రాణాల పరిరక్షణకు ప్రతిష్ట చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా కోరుకొండ మండలంలోని 23 గ్రామాల పంచాయతీ పరిధిలోని కంట్రోల్ రూములు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మూడు షిఫ్టుల్లో ముగ్గురు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు ఏ సమయంలో ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ప్రస్తుతానికి శ్రీరంగపట్నంలో పునరావస కేంద్రంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ప్రమాద భరితంగా ఉన్న హోర్డింగ్లను, కటౌట్లను, చెట్లన ఎటువంటి ప్రమాదం జరగకుండా సచివాలయ సిబ్బంది తొలగించారన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ తో పాటు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల కూడా ఇళ్లకే పరిమితం కావాలన్నారు.

# మొంథా తుఫాన్ చర్యలకు బిఎస్ఎన్ఎల్ సిద్ధం..

**ఏడు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు – ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెలరాజు, ఐటిఎస్**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తీవ్రంగా మారుతున్న మొంథా తుఫాన్‌ని దృష్టిలో ఉంచుకుని ఈవిపత్కర పరిస్థితిలో వినియోగదారు లకు ఇబ్బంది కలుగకుండా రాజమండ్రి బిజినెస్ ఏరియా పరిధిలోని బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ (ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా)సక్రమంగా పనిచేసేలా అన్ని చర్యలు తీసుకున్నా మని, అవసరం అయిన చోట్ల మొబైల్ జెనరేటర్లు ఏర్పాటు చేస్తున్నామని ఏడు డివిజన్లలో ఏడు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని ఒక పత్రిక ప్రకటనలో తెలియచేసారు. తుఫాన్ సమయంలో నెట్వర్క్ ఇబ్బందులు తెలియచేయడానికి 0883 -2472200 నెంబర్లో సంప్రదించాలని తెలియచేసారు.

# కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

## అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు



**బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయంలో "మొంథా" తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన, తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేసిన ఏర్పాట్లు గురించి బిక్కవోలు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్.ఐ మరియు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా ప్రజల భద్రత కోసంతీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ముఖ్యంగా, సమయం దగ్గరగా ఉన్నవారిని గర్భిణీ స్త్రీలు (ప్రెగ్నెంట్ లేడీస్) డెలివరీ ఎంతమందిని సురక్షితంగా ఆసుపత్రుల్లో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు, అలాగే శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని ఎంతమందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. విద్యుత్ మరియు అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు చేశారు.ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ, తహసీల్దార్,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, బిక్కవోలు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రజలందరికీ అండగా కూటమి ప్రభుత్వం

## ప్రజలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భరోసా





**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలో తుఫాన్ దాటికి నేలమట్టం అయ్యిన 130 ఎకరాల వరి పొలాన్ని అధికారుల సమక్షంలో పరిశీలించి రైతులకు అండగా నిలబడి నష్ట పరిహారం అడుగుల ఈ అందజేసే దిశగా అడుగులు వేస్తామని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తెలియజేశారు. చిన్న కొండేపూడి నుండి చీపురుపల్లి గ్రామాల కలిపే రోడ్డు మధ్య లో ఉన్న డ్యాం రైతులకు ధాన్యం భారీ వెహికల్స్ రాకపోకలు ఇబ్బందిగా ఉన్నందున శిధిలా వ్యవస్థలో ఉన్న డ్యామ్‌ని పునర్మించడానికి ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశాలు అందజేశారు. తుఫాన్ కారణంగా చీపురుపల్లి గ్రామంలో వృద్ధురాలి ఇల్లు కూలిపోయిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని హుటా హుటిన ఘటన స్థలం చేరుకుని బాధితురాలిని పునరావస కేంద్రానికి తరలించి ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందజేస్తామని తెలియజేశారు.రాజానగరం నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుడిగాలి పర్యటన చేశారు. మంగళవారం రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బలరామకృష్ణ పర్యటించారు. లోతట్టు ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు ఆదేశాలు సూచనలు అందించారు. గర్భిణీలను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారితో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని.. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలందరికీ ఏ విధమైన కష్టం వచ్చినా.. తాను అందుబాటులో ఉంటానన్నారు. తుఫాన్ వల్ల కష్టం వచ్చిందని అధైర్య పడవద్దని,ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని ధైర్యం అందించారు. తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం నూరు శాతం పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పునరావాస కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు పకడ్బందీ ఏర్పాటు చేయాలని, భోజనం, అల్పాహారం రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. బాధితులకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఇబ్బంది పడుతున్న వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలనీ అధికారులకు సూచించారు. మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు ఉన్నందున అవసరమైతే తప్ప బయట ప్రయాణాలు చేయవద్దని ఎమ్మెల్యే బలరామకృష్ణ పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాల్లో రోడ్లు పూర్తిగా మునిగిపోయి ఉన్నాయని, వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాలను పరిశీలించిన డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట గ్రామం డి-బ్లాక్‌లో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానురం మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో డి-బ్లాక్ లో పునరావాసాలను డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఆ సందర్భంగా డాక్టర్ రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వంతో కలిసి విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని అధైర్య పడవద్దని ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ప్రజలకి అందుబాటులో ఉందని అన్నారు. పునరావస కేంద్రాలలో వసతులు బాగున్నాయని అధికారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వసతులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం భోజన వసతి ఏర్పటులను పరిశీలించి వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజమండ్రి రూరల్ టీడీపీ మండల అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యకులు దుద్దుపూడి రమేష్,కో క్లస్టర్ బొప్పన నానాజీ,గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గా ప్రసాద్,వీరసింగ్,తిరుపతి రాము,ఇమ్మంది శివరామ్, ఇళ్ళా రాము, సేంద్రీ నాని, అధికారులు ప్రత్యేక అధికారి జ్యోతి,ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎమ్మార్వో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కాశి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### అవసరార్థులకు

# ఆకలి తీర్చిన డాక్టర్ మూర్తి

## పేదలకు భోజన సమర్పణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూటయాభై మందికి అన్నదాన కార్యక్రమాన్ని మంగన్న సర్జికల్ అండ్ మెటర్నటీ నర్సింగ్ హోమ్ తాళ్ళపూడి డాక్టర్ మూర్తి అందించిన ఆర్థిక సహాయంతో పేదవారికి భోజనాన్నీ కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమానికి, గోష్పాదా క్షేత్రం దగ్గర ఉన్న పేదవారికి, రాజమండ్రి పుష్కర్ ఘాట్ దగ్గర ఉన్న పేదవారికి, బొమ్మూరు గుడ్ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్, రుతు వృద్ధాశ్రమానికి భోజనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యులు ప్రత్తిపాటి నాగ రాజు, తొర్లపాటి రాజీవ్, సాధనాల కిషోర్, ధర్మతేజలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను ప్రాంతాల్లో బీజేపీ సేవల సిద్ధం..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు మొంథా తుఫాను బాధిత ప్రాంతాల్లో వాలంటీర్స్‌గా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, జిల్లాలోని ప్రతీ మండలం నుంచి వాలంటీర్స్‌గా పని చేయడానికి పార్టీ క్యాడర్ తయారీగా ఉన్నారని, అందుకు సంబంధించిన నాయకుల పేర్లతో కూడిన సూచి బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలోని బిజెపి బృందం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ మొంథా తుఫాను ముంచుకొస్తున్న సందర్భంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించడానికి బిజెపి నాయకులు తయారీగా ఉన్నాము. అందుకు సంబంధించిన సూచిని కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పరిపాలనా అధికారి అలీ అందించడం జరిగింది. ఇప్పటికే ప్రతీ మండలం లోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులలో అధికారులతో కలిసి బిజెపి నాయకులు కూడా పని చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్నామని, అధికారులు ఎక్కడ పని చేయమంటే అక్కడ పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పిక్కి నాగేంద్ర అన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ని కలిసి ఇదే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అడబాల రామక్రిష్ణ, యెనుముల రంగబాబు, ఆకుల శ్రీధర్, గుర్రాల వెంకటరావు, పాతూరి రవి శంకర్, బండి సత్య ప్రసాద్, షేక్ షాజిద్, బొరుసు సుబ్రహ్మణ్యం, కందుకూరి మనోజ్,తగరం సురేష్, జి.వి.రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు పటిష్ట చర్యలు

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర తుఫాను హెచ్చరిక – జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆద్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుఫానుగా మారడంతో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీరం దాటే అవకాశం ఉన్నందున, జిల్లా వ్యాప్తంగా పెను ప్రమాదం పొంచి ఉందనే నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి యుద్ధ ప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టినట్లు డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. తుపాను ప్రభావం ముఖ్యంగా ముమ్మిడివరం, రాజోలు, సఖినేటిపల్లి, అల్లవరం, కాట్రేనికోన, ఐ.పోలవరం అమలాపురం, ఉప్పలగుప్తం ప్రాంతాలలో తీవ్రంగా ఉండనుందని అయినప్పటికీ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 149 సచివాలయాల పరిధిలో షెల్టర్ జోన్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ షెల్టర్ జోన్ నందు ఒక జి.ఎమ్ఎస్.కె, ఒక పోలీసును విపత్తు నిర్వహణ లేదా అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ కోసం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కమ్యూనికేషన్ కోసం జిల్లా నందు 9 ప్రాంతాలలో రిపీటర్స్ ను, 5 కంట్రోల్ రూమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నీటి ప్రవాహ ప్రాంతాలలో గస్తీ పెంపు భారీ వర్షాలు, ఈదురు గాలుల మూలంగా కాలువలు, కల్వర్టులు, వాగులు, వంకల ద్వారా నీటి ప్రవాహాలు ఎక్కువగా ప్రవహించే ప్రాంతాలలో పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందితో కలిసి ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. లోతట్టు ప్రాంతాలలో, పురాతన భవనాలలో లేదా రేకుల షెడ్లలో నివాసం ఉండే ప్రజలను రెవెన్యూ, ఇతర డిపార్ట్‌మెంట్ల సహకారంతో పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలించి, వారికి వసతి సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు.

**హోర్డింగ్‌ల తొలగింపుపై అత్యవసర ఆదేశాలు**

ప్రచార సాధనాలుగా ఇటీవల కాలంలో ఎక్కువగా ఎత్తులో ఏర్పాటు చేయబడిన హోర్డింగ్‌లు ఈదురు గాలులకు పడిపోయి, ప్రమాదం జరిగే ఆస్కారం అధికంగా గ్రహించిన ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్ లను పోలీస్ సిబ్బంది తొలగించినట్లు ఆయన తెలిపారు.

**రంగంలోకి ప్రత్యేక సహాయక బృందాలు**

తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంతో పాటు, సహాయక చర్యలలో పాలు పంచుకోవడానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసిందని దీనికి గాను ఎస్.డిఇర్.ఎఫ్ సిబ్బందితో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో డీఎస్పీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఈ సిబ్బంది ఉంటారని వివరించారు. ప్రతి మండలానికి సీఐ స్థాయి అధికారుల ను నియమించడం జరిగిందని, డ్రోన్ కెమెరాల ద్వారా తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి**

తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేస్తూ, ప్రజలందరూ తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ మీనా విజ్ఞప్తి చేశారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ కూడా బయటకు రాకూడదని. ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా ప్రయాణం పూర్తిగా ప్రమాదకరమని, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగిపడే, లేదా వైర్లు తెగిపడే అవకాశం ఉంది కనుక విద్యుత్ స్తంభాలకు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. మెయిన్ స్విచ్ ను ఆఫ్ చేసి ఉంచాలని, కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాలను దాటడానికి ప్రయత్నించ వద్దని హెచ్చరించారు. వరద నీటిలో వాహనాలను నడపడం అత్యంత ప్రమాదకరం అని జాగ్రత్త వహించాలని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారుల ఆదేశాల మేరకు వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి వసతి సదుపాయాలను, ఆహార పదార్థాలను రెవెన్యూ డిపార్ట్మెంట్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర సహాయం అవసరమైతే, తక్షణమే డయల్ 112 కు సంప్రదించాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు.

### తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

# పర్యటించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కె.గంగవరం.. ప్రకృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్ర పురం నియోజవర్గం కె.గంగవరం మండలంలోని పామర్రు, కూళ్ల,సుందరపల్లి, మసకపల్లి తదితర గ్రామాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస శిబిరాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరిశీలించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,స్వచ్ఛ భారత్ డైరెక్టర్ సలాది రమేష్, గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి వెంకటరమణ, రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, మరివాడ సూరిబాబు తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ పురావాస శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ సహాయక చర్యలను స్వయంగా పరిశీలించారు.ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. ముందస్తు రక్షణ చర్యలుగా తుపాను ముప్పు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని ప్రజలకు ధైర్యం చెప్పారు. అధికారులు సమన్వయంతో పని చేసి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రతీ పునరావాస కేంద్రంలో వైద్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని,ముఖ్యంగా వృద్ధులకు, పిల్లలకు, గర్భిణీ స్త్రీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని,అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రొట్టెలు, దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. తుఫాను పునరావాస శిబిరాల్లో ఉన్న బాధితులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం సమకూర్చిన దుప్పట్లు, రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండారాలు పంపిణీ చేశారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఈ వస్తువులు పంపిణీ చేసినట్టు సత్యం తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పాలు పంచుకుంటుందన్నారు. ఈ వస్తువుల కిట్టు ను మంత్రి సుభాష్,పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తుఫాన్ ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు, కూటమి నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అపార అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ముందస్తుగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అధికారులు చాకచక్యంతో వ్యవహరించాలి

## అత్యవసర సేవలు పట్ల అలసత్వం వద్దు : అధికారులతో ఎమ్మెల్యే వేగుళ్ళ సమీక్షా....



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాగం సిద్ధంగా ఉందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజక వర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలు వివరించారు. మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న వేళ మండపేట నియోజకవర్గంలో అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అప్రమత్తం చేస్తున్నారు. ప్రతీ మండలం పర్యటిస్తూ అక్కడి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. మండపేట తహశ్శిల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, తహశ్శిల్దార్ తేజస్వరరావు, మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు, ఎపిడిఒ సత్య నారాయణ ఇతర అధికారులతో తుఫాన్ నేపథ్యంలో తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కూలిన చెట్లు, విద్యుత్ తీగలను వెంటనే తొలగించే ఏర్పాటు చెయ్యాలన్నారు. పాడుబడ్డ ఇండ్లలో నివసిస్తున్న వారిని గుర్తించి వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల,మున్సిపాలిటీ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి

## రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో 'మేంధా' తుఫాన్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి విజ్ఞప్తి చేశారు.కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలుతో రామచంద్రపురం పట్టణ ప్రజలు శ్రేయస్సు కోసం అనేక సదుపాయాలు సమాకుర్చమని అన్నారు.ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడారు.తుఫాన్ తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని పుర ప్రజలను కోరారు.మున్సిపల్ కమిషనర్,కౌన్సిల్ సభ్యులు మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రజలకు తక్షణ సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక అత్యవసర బృందాలు సిద్ధం చేశామని తెలిపారు. అలానే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సిబ్బంది,వాహనాలు మరియు యంత్రాలను కేటాయించి అత్యవసర పరిస్థితులకు సత్వర చర్యలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేసి అందుబాటులో ఉంచమన్నారు.అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లవద్దని, విద్యుత్ తీగలు తెగిపోతే లేదా నీటిలో పడితే వాటికి దూరంగా ఉండాలన్నారు. కరెంట్ తీగలు కనబడిన వెంటనే మున్సిపల్ లేదా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. చెట్లు,విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ లేదా టిన్ షీట్లు ఉన్న ప్రదేశాల వద్ద ఉండకూడదని హెచ్చరించారు.ప్రజలు అందరూ మున్సిపల్,పోలీసు,రెవెన్యూ శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.మరి ముఖ్యంగా టార్చ్ లైట్లు,డ్రై ఫుడ్, తాగునీరు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జలప్రవాహం ఉన్న రహదారుల్లో నడవడం లేదా వాహనాలు నడపడం చేయరాధన్నారు. వృద్ధులు,చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రజల భద్రతే మా ప్రాధాన్యం అని తెలియజేస్తూ,తుఫాన్ పరిస్థితుల్లో ఎవరికీ ఇబ్బంది కలగకుండా మున్సిపాలిటీ సిబ్బంది 24 గంటలపాటు విధుల్లో ఉంటారని,అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని,ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని కోరారు.మనం అందరం కలిసి ఈ పరిస్థితిని సురక్షితంగా తుఫాన్ సమస్య ప్రభావం ఎదుర్కుందాం అని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తుఫాన్ తీరం దాటిన వెంటనే యువత అందరూ మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో కుల,మత,రాజకీయ పార్టీలుకు అతీతంగా ముందుకు వచ్చి వాలంటీర్ల్ గా సహాయసాకారాలు అందించాలని రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు.

### మొంథా తుఫాన్ ప్రభావంతో

# నేలకొరిగిన చెట్లు, కరెంటు స్తంభాలు...

## సంఘటన స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో మండపేట పట్టణంలో పలుచోట్ల చెట్లు,కరెంటు స్తంభాలు నేలకొరగటంతో ఆయా ప్రాంతాలను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్‌తో కలసి సంఘుట స్థలాలను పరిశీలించారు. వెంటనే మున్సిపల్ అధికారులను, ఎలక్ట్రికల్ అధికారులను రప్పించి దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పనులు చేయించారు. మొంథా తుఫాన్ ఎస్.యానం వద్ద తీరం దాటే అవకాశాలు ఉన్నాయని, తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని గంటకు 100,120 కిమీ వేగంతో గాలులు వేచే అవకాశం ఉంటుంది అని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలంతా బయట తిరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేగుళ్ళ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాధం, పెందుర్తి ప్రధీప్, ముమ్మిడివరపు నారాయణ, తీగిరెడ్డి ప్రశాంత్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన సిద్ధమవుతున్న విద్యుత్ శాఖ

## అసిస్టెంట్ ఇంజనీర్ సందాక శ్రీనివాసులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా మొథా తుఫాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురు గాలులు వీస్తూ,తీవ్ర ప్రభావం చూపనుందనే ఉన్నతాధికారుల హెచ్చరికల మేరకు, రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు ఆదేశాలతో రాయవరం మండల వ్యాప్తంగా 33 కె.వి లైన్ తీగలపై విరిగిపడే అవకాశం ఉన్న చెట్టు కొమ్మలు,తాటి, కొబ్బరి చెట్లను మంగళవారం ఉదయం నుండి అసిస్టెంట్ ఇంజనీర్ సందాక శ్రీనివాసులు ఆధ్వర్యంలో లైన్ మేన్ శ్రీకాంత్ ఇతర సిబ్బందితో కలిసి యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఈ సందర్భంగా ఎ.ఇ శ్రీనివాసులు మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున ముఖ్యంగా సబ్ స్టేషన్ లకు విద్యుత్ సరఫరా జరిగే లైన్లను ముందుగా పరి రక్షించే ప్రయత్నం చేస్తున్నామని, తుఫాను తీవ్రత దృష్ట్యా పరిస్థితులు సవాలు తో కూడినవని అయినప్పటికీ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల సహకారంతో ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు పూర్తిస్థాయి ప్రయత్నం చేస్తామని తెలిపారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన డాక్టర్ శ్రీకాంత్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో తుఫాను తీవ్రత ఎక్కువగా ఉండటం వలన అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఓడలరేవు గ్రామ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందుతున్న సహాయక చర్యలపై అధికారులను ఆరా తీశారు.బాధితులతో మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎవరు బయటకు వెళ్లకూడదని ఆయన సూచించారు.మీకు సౌకర్యాలు అన్ని అందుతున్నాయా లేదా అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి సైక్లోన్ షెల్టర్ వద్దకు రాని వారి ఇళ్లకు వెళ్ళి తుఫాన్ ఎక్కువగా ఉంది, గాలులు బాగా వీస్తున్నాయి, కాబట్టి అందరూ పునరావాస కేంద్రాలకు వెళ్ళాలని ఆయన కోరారు. ఇంట్లో ఉన్న వృద్ధులు చిన్న పిల్లలకు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని మీకు అవసరమైన వాహనాలను స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేకూరుస్తారనీ శ్రీకాంత్ తెలిపారు. మల్లాడి ఉమామహేశ్వరరావు, పల్లి జేమ్స్, రేవు సుందరరావు, మధుర శేఖర్, మధుర చాణక్య, పాలేపు లక్ష్మణ్, ఆయన వెంట ఉన్నారు.

# త్రాగునీటి సమస్య రాకుండా జనరేటర్ ఏర్పాటు చేయాలి

## నుదురుబాద గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు ముందుచూపు




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందనే ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో, గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య ఎదురవకూడదనే ఆలోచనతో నదురుబాద గ్రామంలో జనరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో మంగళవారం ఉదయం నుండి విద్యుత్ లేనందున త్రాగునీటి ఇబ్బంది ఏర్పడ కూడదని ముందు జాగ్రత్త చర్యలుగా జనరేటర్ ను ఏర్పాటు చేసామని, ఈ జనరేటర్ ద్వారా విద్యుత్ కలెక్షన్ ఇచ్చి త్రాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. తుఫాను ప్రభావం దృష్ట్యా గ్రామ ప్రజలు ఇల్లును విడిచి బయటికి రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నదురుబాద ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసామని అధికారుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలుపుతూ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శ్రీనివాసరావు సూచించారు.త్రాగునీటి సమస్య రాకుండా జనరేటర్ ఏర్పాటుచేశారు.

# బిస్కెట్ ప్యాకెట్లు, అరటి పండ్లు పంపిణీ చేసిన చాణక్య



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో మంతా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు, వర్షం ఎక్కువగా ఉండటం వలన గ్రామ ప్రజలను ఓడలరేవు పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సైక్లోన్ సెంటర్‌లో ఉన్న గ్రామ ప్రజలకు, ఓడలరేవు వైఎస్సార్సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు మధుర కుమారస్వామి తనయుడు, యువ నాయకుడు, మధుర చాణక్య బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. పలువురు చాణక్య ను అభినందించారు.

# రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లా ప్రకటించాలి



**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న జిల్లాలలో రంపచోడవరం కేంద్రంగా ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిసం సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిందని రంపచోడవరం చింతూరు పోలవరం ఏజెన్సీ మండలాలైన 14మండలాల ప్రాంతాలను కలుపుతూ ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంతమంతా నిర్వాసిత సమస్యలను తీవ్రంగా ఎదుర్కొనవలసి వస్తుందని ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రమైన పాడేరుకు వెళ్లాలి అంటే సుదీర్ఘ ప్రయాణంతో పాటు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గత ఎన్నికల సందర్భంలో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రంపచోడవరం ఏజెన్సీ ప్రజలకు జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంత ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు హక్కులు పటిష్టంగా అమలు జరగాలంటే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వం జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కేంద్రం తోనే సాధ్యమవుతుందని ప్రభుత్వం ఆ దిశగా జిల్లా కేంద్రాన్ని ప్రకటించి ఈ ప్రాంత ప్రజానీకానికి న్యాయం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో చింతూరు మండల కార్యదర్శి ముట్టం రాజయ్య, తుమ్మల ఎంపిటిసి, వేక రాజ్ కుమార్, గిరిజన సంఘం నాయకులు సోడే సాయి, లక్ష్మణ్, నాగార్జున్, మడివి రామారావు తదితరులు పాల్గొన్నారు.






**మొంథా తుఫాను బీభత్సం నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల వ్యాప్తంగా మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్వహిస్తున్న సహాయక చర్యల దృశ్య మాలిక**









# నగరంలో ఐదు పార్కులు అభివృద్ధి

### ఇప్పటికే పార్కుల సుందరీకరణ జరుగుతోంది - మా ప్రాంతాల్లో పార్కులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు కోరిన చోట పార్కులను అభివృద్ధి జరుగుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)అన్నారు. కంబాల చెరువు పార్కు అభివృద్ధి, సుందరీకరణ చేశామని చెప్పి నగర ప్రజలందరినీ కంబాల చెరువు పార్కుకు రమ్మనడం సరైన విధానం కాదని, అందుకే నగరంలో ప్రజలు కోరినచోట పార్కులను అభివృద్ధిచేసి సుందర నందనవనంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.స్థానిక 10వ డివిజన్ మోరంపూడి కాలనీలో సుమారు రూ. 15 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కును జనసేన పార్టీ రాజమండ్రి ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు రూ. కోటి 95 లక్షలతో నగరంలో ఫేజ్ -1లో ఐదు పార్కులను అభివృద్ధి చేయడం జరుగుతోంద న్నారు. నగరంలో ఏ అభివృద్ధి అయినా టీడీపీ పాలనలోనే జరిగింద న్నారు.ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీ



మేరకు ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం కృషి చేస్తున్నామన్నారు. దానిలో భాగంగానే పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలో కంబాల చెరువు పార్కు మాదిరి ఏదో ఒక పార్కు అభివృద్ధి చేసి నగరంలోని ప్రజలందరినీ అక్కడికే రావాలనడం తమ విధానం కాదని ఆయన అన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల కోరిక మేరకు ఇప్పటికే నగరంలోని 30 పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో కూడా పార్కులను అభివృద్ధి సుందరీకరణ చేయాలని స్థానిక ప్రజలు అడుగుతున్నారని, వారి అభ్యర్థన మేరకు వాటిని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలు వచ్చి ఆహ్లాదకరంగా గడిపేలా పార్కుల్లో సౌకర్యాలు సమకూర్చుతు న్నామని, దాని ద్వారా ప్రజలకు ప్రశాంతత, అలాగే పార్కుల్లో ఏర్పాటు చేసిన జిమ్ సామాగ్రితో వ్యాపారం చేయడం ద్వారా ప్రజలు వ్యాయామం చేసుకుని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రజాప్రతినిధులుగా తమకు నచ్చినట్లు కాకుండా ప్రజలు ఏది కోరితే ఆ పని చేయడమే నిజమైన ప్రజా సేవకుడు చేయాల్సిన పని అని ఆ విధంగా తాను చేసుకు వెళుతున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా నగర ప్రజలు ఏది కోరితే అది చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు నగరంలోని రోడ్లు, అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వారికి కావాల్సిన గుత్తేదారులకు పనులు అప్పజెప్పి అరకొరగా పనులు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తాము అలా కాకుండా ఒక్క రూపాయి కూడా వృధా కాకుండా ప్రజలకు ఏం కావాలో వారి ఆలోచనల మేరకే అభివృద్ధి పనులు, పార్కుల అభివృద్ధి, సుందరీకరణ చేయడం జరుగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, ఆయా డివిజన్ల కమిటీ సభ్యులు,నగర పాలక సంస్థ అధికారులు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## మొంథా తుఫానుతో విద్యుత్‌కు అంతరాయం

### ఎమ్మెల్యే సత్యప్రభ చొరవతో పునరుద్ధరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉదయం నుంచే ఈదురుగాలులు, వర్షాలు కురుస్తూ ఉన్నాయి. ఈ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్తును సరఫరా చేస్తున్న తీగలు దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. విద్యుత్ లేక మోటార్లు పనిచేయక, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ విద్యుత్తుశాఖ అధికార్లతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే దృఢసంకల్పంతో ఆమె తక్షణ చర్యలు తీసుకున్నారు. ఫలితంగా, విద్యుత్ అధికారులు అత్యవసర చర్యలు తీసుకుని దెబ్బతిన్న లైన్లను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరాను దశల వారీగా పునరుద్ధరించారు. విద్యుత్తు సరఫరా పునరుద్దరణ వెంటనే ఎమ్మెల్యే సత్యప్రభ పెదశంకర్లపూడి తన స్వగృహం నుంచే నాలుగు మండలాల ఎంపీడీవోలతో టెలిఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రతి గ్రామంలో త్రాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారికి ఆదేశాలు జారీచేశారు. విద్యుత్ ఉన్నంత వరకు మోటార్లు వేసి ట్యాంకులు నింపి గ్రామ ప్రజలకు త్రాగునీరు అందించాలంటూ అధికారులకు సూచించారు.


## చంటిబాబు ఇంటికి "బోడె"



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దివాన్ చెరువులోని ప్రముఖులు మార్గాని చంటిబాబు ఇంటికి బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ వచ్చి కొద్దిసేపు బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో బీసీలను ఆర్థికంగా రాజకీయంగా ఎదవనివకుండా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. తనపై అనేక అక్రమ కేసులు పెట్టారని, అయినా తాను బీసీవై పార్టీని ముందుకు తీసుకెళ్తూ రాజ్యాధికార దిశగా నా ప్రయాణం సాగిస్తున్నాని అన్నారు.

## కోట శ్రీనివాస్‌ను అభినందించిన కనకాల రాజా

### పేదలకు భారీ అన్నదానం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీలక్ష్మీ గణపతి కమిటీ నిర్వాహకులు కోట శ్రీనివాస్ జన్మదిన వేడుక ఆదివారం మంగళవారపు పేట మూడు సింహాల బొమ్మ సెంటర్ వద్ద అయ్యప్ప ఫాలోవర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కటింగ్ చేశారు.అనంతరం భారీగా అన్నదానం కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా తోపుడు బండ్ల వర్తక సంఘం అధ్యక్షులు కనకాల రాజా మాట్లాడుతూ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న కోట శ్రీనివాస్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో 28వడివిజన్ టిడిపి ఇంచార్జ్ శీలం గోవిందు, అయ్యప్ప ఫాలోవర్స్ , స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ
# సాధనాల శివను పరామర్శించిన ఎమ్మెల్సీ తోట



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** స్నేహితుడి దహన సంస్కారాలకు రాజమండ్రి వెళ్లి తిరిగి మండపేట వస్తుండగా దుళ్ల మడికి మార్గంలో కొబ్బరి లోడుతో వెళ్తున్న వాహనాన్ని తప్పించిపోయి వారి బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో వాహనం టైరు శివ కాలు మీదగా వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి.హుటాహుటిన శివను రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, కాలి నుంచి తొడ భాగం వరకూ చర్మం లేచిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, మండపేట వైసిపి ఇంచార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, యువనేత తోట పృథ్వీరాజ్ ఆసుపత్రికి వెళ్లి శివను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

## రిపబ్లిక్ డే పెరేడ్‌కు
# ఆదిత్య కళాశాల విద్యార్థిని ఎంపిక



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దక్షిణ గుజరాత్ నందలి హేమ చంద్ర చారి నందు ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పెరేడ్ క్యాంపునకు రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల నుంచి బీకాం మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పరిమళ హరిప్రియ ఎన్నిక కావడం హర్షదాయకమని కళాశాల యజమాన్యం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పరిమళ హరిప్రియను కళాశాల అకాడమిక్ డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రెహమాన్ కళాశాల ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు అభినందించారు. హరిప్రియను రోల్ మోడల్‌గా తీసుకుని విద్యార్థు లందరూ ఇలాంటి అవకాశాల కోసం ప్రయత్నించాలని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి పిలుపునిచ్చి విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సుడిగాలి పర్యటన




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ముగ్గుళ్ళ ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ అన్నారు.పునరావాస కేంద్రం సందర్శించి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అధికారులు ఏమాత్రం అలసత్వానికి తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. బాధితులకు అందించే ఆహార పదార్థాలు, ఇతర సౌకర్యాల విషయంలో చొరవగా ఉండాలని సూచించారు.

# 8వ వేతన కమిషన్‌కు ఆమోదం

న్యూఢిల్లీ

దేశంలో 8వ కేంద్ర వేతన కమిషన్ (సీపీసీ)కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఈ కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, 69 లక్షల మంది పెన్షనర్లకు పింఛన్లు పెరగనున్నాయి. కేంద్ర మంత్రివర్గం మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశయ్యింది. 8వ కేంద్ర వేతన కమిషన్‌కు ఆమోద ముద్ర వేసింది. ఈ ఏడాది జనవరిలో 8వ సీపీసీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్‌లో ఒక చైర్‌పర్సన్, తాత్కాలిక సభ్యుడు, ఒక సభ్య కార్యదర్శి ఉంటారు. కమిషన్‌ను ఏర్పాటు చేసిన తేదీ నుంచి 18 నెలల్లోగా తన సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిఫార్సులను రూపొందించే సమయంలో పలు కీలక అంశాలను కమిషన్ దృష్టిలో పెట్టుకోనుంది. ఇందులో భాగంగా దేశంలోని ఆర్థిక పరిస్థితులు, అభివృద్ధి వ్యయం, సంక్షేమ పథకాలకు తగిన వనరులు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించుకోవాలి. సహకారేతర పెన్షన్ పథకాలకు నిధులు, ఖర్చు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలపై సిఫార్సుల ప్రభావం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ ఉద్యోగుల ప్రస్తుత జీతాల నిర్మాణం, ప్రయోజనాలు, పని పరిస్థితులను పరిశీలించాల్సి ఉంటుంది. తుది సిఫార్సులను సూచించిన తర్వాత కూడా 8వ సీపీసీ తమ పరిధిలోని అంశాలపై మధ్యంతర నివేదికలను సమర్పించే వెసులుబాటు ఉంది. కమిషన్ సిఫార్సులు వచ్చే ఏడాది అమల్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. సరిగ్గా బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, ఇతర ప్రయోజనాలను కమిషన్ సమగ్రంగా పరిశీలిస్తుంది, తగిన మార్పులను సూచిస్తుంది. ఈ కమిషన్‌లో ఐఐఎం(బెంగళూరు) ప్రొఫెసర్ పులక్ ఘోష్ తాత్కాలిక



సభ్యుడిగా, పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ సభ్యకార్యదర్శిగా వ్యవహరించబోతున్నారు. జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా పనిచేస్తున్నారు.
ఆమె గతంలో పలు ప్రభుత్వ కమిటీలకు సారథ్యం వహించారు. కేంద్ర పాలిత జమ్మూకశ్మీర్ పునర్విభజన కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు. ఉత్తరాఖండ్ యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ) ముసాయిదా కమిటీలోనూ పనిచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమెకు అప్పగించిన నాలుగో అతిపెద్ద బాధ్యత వేతన కమిషన్ చైర్‌పర్సన్‌గానే. 7వ వేతన కమిషన్‌ను 2014 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సిఫార్సులు 2016 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి.

**రబీ సీజన్‌లో ఎరువులకు రాయితీ**

మరో కీలకమైన నిర్ణయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025%–%26 రబీ సీజన్‌లో ఎరువులకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. ఫాస్ఫరస్, పొటాష్‌యం ఎరువులపై పోషక ఆధారిత సబ్సిడీ ఇవ్వనుంది. ఎరువుల రాయితీ కోసం రూ.37,952 కోట్లు ఖర్చు చేయనుంది. ఇది 2025 ఖరీఫ్ సీజన్ బడ్జెట్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని కేంద్రం స్పష్టంచేసింది. ఫాస్ఫేట్‌పై సబ్సిడీని కిలోకు రూ.43.60 నుంచి రూ.47.96కు, సల్ఫర్‌పై సబ్సిడీని కిలోకు రూ.1.77 నుంచి రూ.2.87కు పెంచారు. రైతులకు సరసమైన, సహేతుకమైన ధరలకు ఎరువులు లభించేలా ఈ సబ్సిడీని అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్రం పేర్కొంది. అయితే, నైట్రోజన్, పొటాష్ ఎరువులపై రాయితీలో ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. నైట్రోజన్‌పై రాయితీ కిలోకు రూ.43.02, పొటాషిపై రాయితీ కిలోకు రూ.2.38 చొప్పున లభిస్తుంది.

# ఉత్తర బిహార్‌లో ఉనికి పోరాటం

న్యూఢిల్లీ

బిహార్‌లో విపక్షాల మహాగఠ్‌బంధన్ కూటమిలో ఆర్జేడీ తర్వాత కీలక భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉత్తరబిహార్ ప్రాంతంలో తన ఉనికిని కాపాడుకునేందుకు పెద్ద పోరాటమే చేస్తోంది. ఉత్తరబిహార్ పరిధిలో మొత్తం 71 శాసనసభ నియోజక వర్గాలు ఉన్నాయి. అయితే గత ఎన్నికల్లో ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒకే ఒక్క స్థానంలో విజయకేతనం ఎగరేసింది. ఈసారి ఆ ఒక్క సీటును కూడా నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు పెద్ద పరీక్షలా తయారైందని వార్తలు వినిపిస్తున్నాయి. గత రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నెమ్మదినెమ్మదిగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. 2010 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులంతా ఓటమిని మూటగట్టుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 20 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపింది. వారిలో ఒకే ఒక్క అభ్యర్థి విజయం సాధించారు. ఉత్తర బిహార్‌లోని 71 నియోజకవర్గాల్లో ఒక్క ముజఫర్‌పూర్‌లో మాత్రమే విజేంద్ర చౌదరి గెలిచారు. ఈసారి కూడా ఆయనే బరిలోకి దిగుతున్నారు. అయితే ఈ ఐదేళ్లు నియోజకవర్గంలో సరైన అభివృద్ధి పనులు చేపట్టలేదని స్థానిక ఓటర్లు ఈయనపై గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది. అదే నిజమైతే ఈసారి ఈయన విజయావకాశాలకు గండిపడటం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. మరికొన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ నేతలు తమ శాయశక్తులు ఒడ్డి పోరాడుతున్నారు.
ఉమేష్ కుమార్ రామ్(సక్రా నియోజకవర్గం), నలిని రంజన్ ఝా రూపం(బెనిపట్టి), సుబోధ్ మండల్(ఫుల్పరస్), అమిత్ కుమార్ తన్నా(రిగా), ఇంజనీర్ నవీన్ కుమార్(బత్నాహా), సయ్యద్ అబు దోజన(సుర్సాండ్), శ్యామ్ బిహారీ ప్రసాద్(రక్సౌల్), శశి భూషణ్ రాయ్(గోవింద్ గంజ్), అమిత్ కుమార్(నౌతన్), అభిషేక్ రంజన్(చన్పాటియా), వాసి అహ్మద్(బెట్టియా), శశ్వత్ కేదార్(నర్కటియాగంజ్), సురేంద్ర ప్రసాద్(వాల్మీకినగర్), జయేష్ మంగళ్ సింగ్(బాగహా), మిథిలేష్ చౌదరి(బేనీపూర్), రిషి మిశ్రా(జాలే), రవి(రోసెరా) సైతం ఎన్నికల రణరంగంలో దూకి తమ రాజకీయచతురతతో విజయపతాక ఎగరేద్దామని ఉత్సాహంతో ఉన్నారు. అయితే ఎన్‌డీఏ పార్టీ అభ్యర్థుల నుంచి వీళ్లు గట్టి పోటీని



ఎదుర్కొంటున్నారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.
నాడు పార్టీని అణచివేసి.. నేడు అభ్యర్థిగా విజయం..
ఉత్తర బిహార్ ప్రాంతంలో ఈసారి మొత్తం 18 చోట్ల మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో 20 చోట్ల కాంగ్రెస్ తన అభ్యర్థుల్ని నిలబెట్టింది. 1977 ఏడాదికి ముందు ముజఫర్‌పూర్ జిల్లాలోని మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేవి. కానీ.. ఇప్పుడు కేవలం విజేంద్ర చౌదరి మాత్రమే ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 1995 ఎన్నికల్లో ముజఫర్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీని విజేంద్ర చౌదరి పూర్తిగా తుడిచిపెట్టేశారు. గతంలో పలుమార్లు జేడీయూ, ఆర్జేడీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగానూ ఎన్నికల బరిలో దిగారు. 2019 మార్చిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సురేశ్‌కుమార్ శర్మను ఓడించి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చారు.

**90వ దశకం నుంచే పరాజయాల చరిత్ర**

గత రెండున్నర దశాబ్దాలుగా ముజఫర్‌పూర్ జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం గుర్తుకు ఓటర్లు ముఖం చాటేయడం మొదలెట్టారు. 1972 వరకు కాంగ్రెస్‌కు ఈ ప్రాంతంలో ఎదురేలేదు. తర్వాత ఇక్కడి ఓటర్ల వైఖరిలో స్పష్టమైన మార్పు కన్పించింది. పార్టీ కేడర్‌లో అంతర్గత కుమ్ములాటలు, స్థానికేతరులు జోరు పెంచడంతో ఓట్ల రేసులో కాంగ్రెస్ వెనుకబడింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ముజఫర్‌పూర్ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ముజఫర్‌పూర్ నుంచి బిజేంద్ర చౌదరి, పారు నుంచి అనునయ్ ప్రసాద్ సిన్హా, సక్రా నుంచి ఉమేష్ కుమార్ రామ్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. ఈ ముగ్గురిలో బిజేంద్ర ఒక్కరే గెలిచారు. తద్వారా రెండున్నర దశాబ్దాల తర్వాత మొదటిసారిగా జిల్లాలో కాంగ్రెస్ ఉనికిని చాటారు. ఈ సారి ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో చూడాలి.

# 'భజనలో.. గోల్డ్ మెడల్ నీకేపో!'

ఒకవేళ భజన అనే పోటీ గనుక ఒలింపిక్స్‌లో ఉండి ఉంటే.. పాకిస్తాన్‌కు కచ్చితంగా ఆ పోటీల్లో గోల్డ్ మెడల్ వచ్చి తీరేదేమో!. విన్నర్ పోడియంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉండి ఉండేవారేమో!.. ఈ మాటలు అంటోంది ఆ దేశ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విపరీతమైన ప్రశంసలు గుప్పించాడు. కంబోడియా–థాయ్‌లాండ్ మధ్య తాజాగా కౌలాలంపూర్ ట్రంప్ సమక్షంలో శాంతి ఒప్పందం కుదరింది. ఈ నేపథ్యంలో.. శాంతి, స్థిరత్వానికి కృషి చేసే నాయకుండంటూ పాక్ ప్రధాని విపరీతమైన పొగడ్తలు గుప్పించారు. మొన్న గాజా శాంతి ప్రణాళిక.. ఇప్పుడేమో ఇది. మధ్యప్రాచ్యం, దక్షిణాసియాలో శాంతి కోసం ట్రంప్ చేసిన కృషి ప్రపంచాన్ని రక్షించింది. లక్షల మంది ప్రాణాలు



పోకుండా నిలబెట్టింది అని షెహబాజ్ పేర్కొన్నారు. దీనిపై పాకిస్తాన్ మాజీ అమెరికా రాయబారి హుస్సేన్ హక్కానీ, షెహబాజ్ షరీఫ్‌పై వ్యంగ్యంగా స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్రంప్‌ను పొగడటంలో ఒలింపిక్ గోల్డ్ మెడల్ గెలిచే స్థాయిలో ఉన్నారంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఫరీద్ జకారియా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. 'ఇది ఒలింపిక్ క్రీడ అయితే, షరీఫ్ పోడియం మీద గోల్డ్ మెడల్‌తో నిలిచేవారు అని అన్నారు. ఈజిప్ట్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులోనూ షరీఫ్ ట్రంప్‌ను విపరీతంగా పొడిగారు. ట్రంప్‌ను శాంతి పురుషుడిగా అభివర్ణిస్తూ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడంటూ మాట్లాడారు. ఆ సమయంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చిత్రమైన హావభావాలు ప్రదర్శించడం విపరీతంగా వైరల్ అయ్యింది. షరీఫ్ మాటలతో కడుపు నిండిపోయిన ట్రంప్ 'ఇక మాట్లాడేం లేదని, ఇంటికి వెళ్లిపోదాం' అంటూ వ్యంగ్యంఆ స్పందించడం మరో కొసమెరుపు. అయితే షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను పాక్ పౌరులే భరించలేకపోయారు. అంతలా దిగజారి పొగడాల్సిన అవసరం ఏముందంటూ.. ప్రధానిని తిట్టిపోశారు కూడా.

## విలాస వైభోగమే

వచ్చే పదేళ్లలో మనదేశంలో ప్రతి నలుగురిలో ఒకరు.. తమకు నచ్చిన వాటిని కొనే స్థోమతతో, అత్యధికంగా ఖర్చు చేయగలిగే స్థితిలో ఉంటారు. అంటే ఒకప్పుడు అవసరాల కోసమే ఖర్చు చేసినవారు.. విలాసవంతమైన, లైఫ్‌స్టైల్ వస్తువులు, ఖరీదైన సేవలు, ప్రీమియం బ్రాండ్ల కొనేస్థాయికి ఎదుగుతారు. మొత్తం వ్యయంలో ప్రస్తుతం 36 శాతంగా ఉన్న ఈ ఖర్చు వచ్చే ఐదేళ్లలో 43 శాతానికి పెరుగుతుందట.
2010లో 1,360 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం.. 2031 నాటికి దాదాపు నాలుగు రెట్లు పెరిగి 5,242 డాలర్లకు చేరనుంది. బియాండ్ నెసెస్సిటీస్ ఏ ఇండియాస్ ఎఫ్లుయెంట్ డ్రివెన్ గ్రోత్' పేరిట ప్రముఖ పెట్టుబడుల నిర్వహణ సంస్థ ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. ప్రీమియం ఉత్పత్తులు, లైఫ్‌స్టైల్ వస్తువుల వాడకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఉదాహరణకు హొటళ్లలో భోజనాలు, వినోదాలు, విహార యాత్రలు, అవసరం లేకపోయినా ఇంటికి విలాసవంతమైన వస్తువులు.. ఇలాంటి వాటికి అధిక వ్యయం చేస్తున్నారట. భారతదేశ వృద్ధి చిత్రం మారుతోందంటూ 'బియాండ్ నెసెస్సిటీస్ ఏ ఇండియాస్ ఎఫ్లుయెంట్ డ్రివెన్ గ్రోత్' పేరిట ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ విడుదల చేసిన నివేదికలో ఈ ఆసక్తికర అంశాలను తెలిపింది. ఈక్విటీల్లో పెట్టుబడులు, రియల్ ఎస్టేట్‌లో వృద్ధి, బంగారం ధర అనూహ్యంగా పెరగడం.. ఇలాంటి అనేక అంశాలు ఇందుకు కారణం కానున్నాయని పేర్కొంది. ప్రజలు నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు. బ్రాండ్ల వాడకాన్ని ఇష్టపడుతున్నారు. అందుకే, 2023%–%24లో చవకైన, ఎక్కువగా దొరికే (మాస్ మార్కెట్) వస్తువుల కంటే.. ఖరీదైన, విలాసవంతమైన వస్తువులకు గిరాకీ పెరిగింది. ప్రీమియం డిటర్జెంట్ల అమ్మకాలు 26 శాతం పెరిగితే.. మాస్ మార్కెట్ వస్తువుల అమ్మకాల్లో 7 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. సాధారణ టీ వినియోగం 10 శాతం పెరిగితే.. గ్రీన్ టీ వాడకం 25 శాతం పెరిగింది. స్పోర్ట్స్ ఫుట్‌వేర్ అమ్మకాలు 13 శాతానికిపైగా పెరిగితే, సాధారణ ఫుట్‌వేర్ అమ్మకాలు 8 శాతమే పెరిగాయి. విలాసాలు, ఖరీదైన వాటి కోసం దేశ ప్రజలు 2000లో చేసింది.. మొత్తం వ్యయంలో 25 శాతానికిపైనే ఉంది. ప్రస్తుతం 36 శాతంగా ఉన్న ఆ ఖర్చు 2030 నాటికి 43 శాతానికి పెరుగుతుందట.

**ఫ్యాక్టరీలు కాదు.. ఇళ్లు!**

ఎఫ్ఎమ్‌సీజీ అమ్మకాల పెరుగుదల రోజువారీ అలవాట్లలో మార్పును సూచిస్తే.. గృహోపకరణాల అమ్మకాలు భారతీయ గృహాలు ఎలా మారాయో చెబుతాయి. 2024లో దేశ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ మార్కెట్ విలువ రూ.6.45 లక్షల కోట్లు కాగా.. ఇది 2029 నాటికి రెట్టింపై రూ.12.9 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా. అలాగే దేశంలోని కుటుంబాల పొదుపు మొత్తం 2023%–%24లో రూ.54 లక్షల కోట్లు కాగా.. 2030 నాటికి ఇది రూ.82 లక్షల కోట్లకు పెరుగుతుంది. అందుకే, 'భారతదేశ అభివృద్ధి గాథను.. దేశంలోని ఫ్యాక్టరీలు కాదు, గృహాలు రచిస్తున్నాయి' అని ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది.

**రిస్కులూ ఉన్నాయి**

అధికాదాయ, మధ్య తరగతి వర్గాల అధిక వ్యయాలతో నడిచే ఈ ఆర్థిక ప్రగతికి రెండు ప్రధాన అడ్డంకులూ ఉన్నాయని నివేదిక తెలిపింది. అందులో మొదటిది ఉద్యోగ నాణ్యత. అంటే.. స్థిరమైన ఉద్యోగం ఉంటేనే మంచి సంపాదన ఉంటుంది. అప్పుడే ఖర్చులూ ఎక్కువగా చేయగలరు. యంత్రాలూ, ఏఐ వంటి వాటి వల్ల కోల్పోయే ఉద్యోగాల వల్ల ఈ అభివృద్ధికి విఘాతం ఏర్పడవచ్చు. అలాగే ఈక్విటీల్లో తగ్గుదలలు, బంగారం ధర పడిపోవడం వంటివి కూడా ఈ పరిస్థితిని ప్రభావితం చేయవచ్చు.

**ఎగువ మధ్య తరగతి, శ్రీమంతులు!**

2010లో 1,360 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం 2024 నాటికి రెట్టింపై 2,729 డాలర్లకు చేరిందని అంచనా. ఇది 2031 నాటికి 5,242 డాలర్లకు చేరుతుందట. 2010 నాటికి దేశ జనాభాలో సుమారు 68 శాతంగా ఉన్న పేద, నిరుపేద వర్గాల వారు.. 2015 నాటికి 58 శాతానికి తగ్గిపోయారు. 2035 నాటికి ఇది సుమారు 48 శాతానికి తగ్గిపోతుందని అంచనా. ఎగువ మధ్య తరగతి, శ్రీమంతుల శాతం 2035 నాటికి 24 శాతానికి చేరనుంది.

## గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు


**నెతన్యాహు ఆదేశంతో ప్రారంభం**

టెల్ అవీవ్

అమెరికా మధ్యవర్తిత్వంతో హమాస్, ఇజ్రాయెల్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందానికి తూట్లు పడ్డాయి. గాజాపై శక్తిమంతమైన దాడులు చేయాలని మంగళవారం తమ సైన్యాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదేశించారు. వెంటనే రాత్రికల్లా దాడులు ప్రారంభమయ్యాయి. పలుచోట్ల బాంబుల శబ్దాలు వినిపించాయి. దక్షిణ గాజాలో తమ బలగాలపై హమాస్ కాల్పులు జరిపిందని, అందుకే ఈ ఆదేశాలిచ్చామని ఆయన వెల్లడించారు. మరోవైపు ఇజ్రాయెల్ తీరును హమాస్ నిరసించింది. మృతదేహాల అప్పగింతను ఆలస్యం చేస్తామని హెచ్చరించింది. హమాస్ ఇంకా 13 మృతదేహాలను అప్పగించాల్సి ఉంది. హమాస్ సోమవారం రాత్రి అప్పగించిన ఓ బందీ మృత శరీర భాగాలు.. రెండేళ్ల కిందట గాజాలో తమ బలగాలు స్వాధీనం చేసుకున్న మృతుడికి సంబంధించినవని నెతన్యాహు అంతకుముందు ఆరోపించారు. ఇది కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. దీనిపై ఎలా స్పందించాలనే అంశంలో నిర్ణయం తీసుకునేందుకు భద్రతాధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ మీడియా తదుపరి అవకాశాలపై కథనాలను ప్రచురించింది. హమాస్ నేతలే లక్ష్యంగా గాజాపై వైమానిక దాడులకు దిగవచ్చని వెల్లడించింది. అన్నట్లుగానే దాడులు ప్రారంభమయ్యాయి.

## తీరానికి చేరువవుతున్న మొంథా..

## భారత రైల్వే శాఖ అప్రమత్తం



'మొంథా' తుఫాను ముంచుకొస్తుండటంతో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాల్లో, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితోపాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. తుఫాను వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారుల నుంచి నివేదిక కోరారు. తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణం స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తుఫాను కారణంగా రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించాలని పేర్కొన్నారు.

## బిజినెస్ వాయిస్

### భారీగా పడిపోయిన బంగారం ధరలు..!



ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ. 1,13, 000 ఉండగా.. నేడు రూ. 750 తగ్గి రూ. 1, 12, 250గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ. 1,23, 280 గా ఉంది. నేడు రూ. 820 తగ్గి రూ. 1, 22, 460 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

### వన్ ప్లస్ నుంచి మరో ఫోన్ వచ్చేస్తోంది



మన భారత మార్కెట్లో రకరకాల మొబైల్ ఫోన్స్ వస్తున్నాయి. ఇందులో సామాన్యులు కూడా కొనుగోలు చేసేలా ఫోన్స్ రావడం గమనార్హం. ముఖ్యంగా వన్ ప్లస్ నుంచి అదిరిపోయే ఫోన్లు ఈ మధ్య వస్తున్నాయి. మార్కెట్ లో ఈ కంపెనీకి మంచి పేరు ఉన్న నేపథ్యంలో జనాలు కూడా కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ఇలాంటి నేపథ్యంలో వన్ ప్లస్ కంపెనీ నుంచి మరో సరికొత్త మొబైల్ ఫోన్ ఇండియాలో త్వరలో లాంచ్ కానుంది. వన్ ప్లస్ 15 పేరుతో చైనాలో కొత్త మొబైల్ ఫోన్ లాంచ్ చేసింది కంపెనీ. మన ఇండియాలో నవంబర్ రెండవ వారంలో ఈ మొబైల్ ఫోన్ తీసుకువచ్చే ప్లాన్ చేస్తోంది. గత సంవత్సరం వన్ ప్లస్ 13 తీసుకువచ్చిన కంపెనీ, నేరుగా వన్ ప్లస్ 15 కు వచ్చేసింది. వనప్లస్ 14 మోడల్ ను హోల్డ్ లో పెట్టింది. 6.78 అంగుళాల డిస్ప్లే కలిగి ఉన్న ఈ మొబైల్ ఫోన్ ధర 70 వేల వరకు ఉండే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. 50 ఎంపీ ప్రధాన కెమెరా అందిస్తున్నారు. 7300 ఎంఏహెచ్ బ్యాటరీ కూడా కలిగి ఉంటుంది. 120%ష% వైర్డ్ చార్జింగ్ మాత్రమే సపోర్ట్ చేస్తుంది. 8.31 ఎంఎం మందంతో ఉన్న ఈ మొబైల్ 215 గ్రాములు ఉంటుంది. ఆండ్రాయిడ్ 16 ఆధారంగా ఈ ఫోన్ పని చేస్తుంది. వన్ ప్లస్ 13%ూ% ఫోన్ ను ఇది పోలి ఉంటుంది.

## అదానీ కంపెనీకి భారీగా తగ్గిన లాభం..

# ఏకంగా 28 శాతం డౌన్




దేశంలోని దిగ్గజ పారిశ్రామిక వేత్త, అదానీ గ్రూప్‌కు చెందిన గౌతమ్ అదానీకి ఇటీవల పెద్దగా ఏదీ కలిసి రావట్లేదని చెప్పొచ్చు. అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్.. సంచలన రిపోర్ట్ విడుదల చేసిన తర్వాత చాన్నాళ్లకు అదానీ గ్రూప్ స్టాక్స్ కోలుకున్నట్లే కనిపించినా.. ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల నుంచి తక్కువలోనే ఉన్నాయి. ఆయా కంపెనీలు ఫలితాల్లోనూ పెద్దగా రాణించట్లేదు. ఈ క్రమంలోనే అదానీ కూడా దూకుడు కాస్త తగ్గించారు. అంతకుముందు పలు రంగాల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టగా.. ఇన్వెస్టర్లు అదానీ గ్రూప్ స్టాక్స్‌పైనా దృష్టి సారించిన నేపథ్యంలో స్టాక్స్ పుంజుకొని ఇన్వెస్టర్లకు కాసుల వర్షం పండించాయి. ఈ క్రమంలోనే తాజాగా అదానీ గ్రూప్ ఇంధన సంస్థ.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ఫలితాల్ని వెల్లడించింది. ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం రూ. 557.10 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ఇక్కడ లాభం 28 శాతం తగ్గుముఖం పట్టింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో లాభం రూ. 773 కోట్లుగా ఉంది. అయితే ఈ సారి లాభం తగ్గేందుకు ప్రధాన కారణం.. ఏడాది కిందటి వాయిదా వేసిన పన్ను వన్ టైమ్ అడ్జస్ట్‌మెంట్ కింద రూ. 314 కోట్లు చెల్లించడమేనని సంస్థ పేర్కొంది. ఇక కంపెనీ కార్యకలాపాల ఆదాయం ఇదే సమయంలో 6.4 శాతం పెరిగి రూ. 6767 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఇదే సమయంలో ఇది రూ. 6,360 కోట్లుగా ఉండేది. ఇక కంపెనీ మొత్తం వ్యయాలు రూ. 5,687 కోట్లుగా ఉంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో కంపెనీ ఆదాయం 16.4 శాతం పెరిగి రూ. 13,793 కోట్లుగా నమోదైంది. ఫలితాల్లో నిరాశపర్చిన నేపథ్యంలో ఈ స్టాక్ ధర ఇవాళ (సోమవారం) సెషన్‌లో ఫ్లాట్‌గా ముగిసింది. కిందటి రోజు రూ. 944.25 వద్ద ముగియగా ఇవాళ ఒక దశలో ఇంట్రాడేలో రూ. 951.80 వద్ద గరిష్టాన్ని తాకినప్పటికీ.. చివరికి స్వల్ప లాభంతో రూ. 945.05 వద్ద స్థిరపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 1090.95 కాగా.. కనిష్ఠ ధర రూ. 588 గా ఉంది. కంపెనీ మార్కెట్ విలువ చూస్తే రూ. 1.14 లక్షల కోట్లుగా ఉంది. నెల వ్యవధిలో ఈ స్టాక్ దాదాపు 8 శాతం పుంజుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 17 శాతం ఎగబాకింది. ఏడాది వ్యవధిలో మాత్రం పెద్దగా రాణించలేదు.

## మెహ్లీ మిస్త్రీకి షాక్.. టాటా ట్రస్టుల్లో దక్కని కొనసాగింపు

దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్‌ల్లో చుక్కెదురైంది. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదని సమాచారం. దీంతో టాటా ట్రస్ట్‌లతో ఆయన బంధం ముగిసినట్లే కన్పిస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ కథనం వెల్లడించింది. సర్ రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జంషెడ్జీ టాటా నవ్సారి ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్‌కు ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించే ప్రతిపాదనకు అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ గతవారం ఒక సర్క్యులర్ పంపారు. ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వ్యతిరేకించారు. గురువారం అర్ధరాత్రి తర్వాత వీరు తమ నిర్ణయాన్ని ట్రస్ట్స్ సీఈఓకు పంపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ట్రస్ట్‌ల్లో మెజార్టీ దక్కకపోవడంతో మెహ్లీ పునర్నియామకానికి ఆమోదం లభించలేదని సమాచారం. టాటా గ్రూపులో అంతర్గత విభేదాలు చోటుచేసుకుంటున్నాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.




మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. ఆయన మూడేళ్ల పదవీకాలం నేటితో (అక్టోబరు 28) ముగియనుంది. కాగా.. జీవితకాల ట్రస్టీగా వేణు శ్రీనివాసన్ పునర్నియామకానికి గతవారం టాటా ట్రస్ట్స్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

# రేపటి నుంచే సెమీస్ యుద్ధం..
# కొత్త ఛాంపియన్ అవతరించేనా?

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కీలక మ్యాచ్‌లకు రేపటితో తెరలేవనుంది. లీగ్ దశలో అదరగొట్టిన నాలుగు జట్లు ఇప్పుడు సెమీఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు ఇప్పటికే మాజీ ఛాంపియన్లుకాగా .. భారత్, దక్షిణాఫ్రికా తొలి కప్ కోసం చకోర పక్షుల్లా నిరీక్షిస్తున్నాయి. నాకౌట్ దశలో తిరుగులేని ఆసీస్, ఇంగ్లీష్ జట్లకు చెక్ పెడితే తప్ప కొత్త విజేతను చూడలేం. అన్ని విభాగాల్లో దుర్భేద్యంగా ఉన్న ఈ రెండు జట్లకు టీమిండియా, సఫారీ టీమ్‌లు మట్టికరిపించాలంటే సర్వశక్తులు ఒడ్డాల్సిందే. ఒకరిద్దరి మీద ఆధారపడకుండా సమిష్టిగా రాణించడం తప్ప మరో దారి లేదు. వరల్డ్ కప్ అంటే చాలు.. ఆస్ట్రేలియా జట్టు ట్రోఫీని తన్నుకపోవడం పరిపాటి అయింది. పురుషుల జట్టు మాత్రమే కాదు ఆ దేశపు ఆడ సింహాలు కూడా రికార్డు స్థాయిలో కప్‌ను తన్నుకుపో యాయి. ఎక్కడ టోర్నీ జరిగినా విజేతలం మేమే అన్నట్టుగా ఆసీస్ (1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022, ) ఎనిమిదిసార్లు, ఇంగ్లండ్ జట్టు (1973, 1993, 2009, 2017) నాలుగుసార్లు ఛాంపియన్లు అయ్యాయి. ఈ రెండు జట్లను కాదని ఒకేఒకసారి 2000 సంవత్సరంలో న్యూజిలాండ్ విశ్వవిజేతగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు పదమూడో సీజన్‌లోనూ అలీసా హేలీ సారథ్యంలోని కంగారూ టీమ్‌అజేయంగా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లి తొమ్మిదోసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. మరోవైపు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి మినహా ఛాంపియన్ ఆటతో ఇంగ్లండ్ సెమీస్ బెర్తు దక్కించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్, హీథర్ నైట్, అమీ జోన్స్ రాణిస్తుండగా.. స్పిన్నర్లు లిన్సే స్మిత్, డీన్స్, ఎకిల్‌స్టోన్ ఆ జట్టు విజయాల్లో కీలకం అవుతున్నారు. సెమీస్‌లోనూ విజయంతో ఐదో కప్ వేటకు మరింత చేరువవ్వాలనే పట్టుదలతో ఉంది ఇంగ్లండ్. ఇక.. దక్షిణాఫ్రికా కథ వేరు. ఆరంభ పోరులోనే ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోలేక 69 పరుగులకే ఆలౌటయ్యింది సఫారీ టీమ్. అయితే.. మ్యాచ్ అనంతరం 'మేము 69 ఆలౌట్ కన్నా ఎంతో మెరుగైనవాళ్లం' అని చెప్పిన కెప్టెన్ లారా వొల్వార్డ్ ఊహించని విధంగా జట్టును సెమీస్ చేర్చింది. మిడిలార్డర్లలో చోలే ట్రయాన్, మరినే కాప్.. ఫినిషర్ డీక్లెర్క్ తుఫాన్ ఇన్నింగ్స్‌లకు తోడు.. స్పిన్నర్ మ్లాబా జోరుతో వరుసగా ఐదు విజయాలతో దర్జాగా నాకౌట్ పోరుకు అర్హత సాధించింది.

**97 పరుగులకే కుప్పకూలి**




చివరి లీగ్ మ్యాచ్‌లోనూ విజయంతో సెమీస్‌కు ఆత్మవిశ్వాసం కూడకట్టుకోవాలనుకున్న సఫారీల కథ ఆస్ట్రేలియాపై ఓటమితో మళ్లీ మొదటికి వచ్చింది. విశాఖపట్టణంలో భారత జట్టుపై 3 వికెట్ల తేడాతో గెలుపొందిన లారా బృందం అదే వేదికపై ఒత్తిడికి తలొగ్గింది. ఆసీస్ లెగ్ స్పిన్నర్ అలనా కింగ్(7-218) ధాటికి 97 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం మూటగట్టుకుంది. మరి.. సెమీస్‌లో ఇంగ్లండ్‌కు షాకిచ్చి తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటుందా? లేదా? అనేది రేపటితో తెలిసిపోనుంది. నిరుడు టీ20 వరల్డ్ కప్ ఆసాంతం దుమ్మురేపిన లరా బృందం.. చివరకు ఫైనల్లో మాత్రం కుదేలైంది. తొలిసారి పొట్టి ప్రపంచ కప్ ఛాంపియన్ అయ్యే అవకాశాన్ని చేజార్చుకుంది. అమేలియా కేర్ ఆల్‌రౌండ్ షోతో విజేతగా అవతరించిన న్యూజిలాండ్ తొలి కప్ కలను సాకారం చేసుకుంది.

**ఓపెనర్లే బలం..**

వన్డే ప్రపంచ కప్ చరిత్రలో రెండుసార్లు ఫైనల్ చేరిన భారత జట్టు.. ఆఖరి మెట్టుపై తడబడింది. మొదటిసారిగా 2005లో మిథాలీ రాజ్ సారథ్యంలో టీమిండియా టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. కానీ ఆస్ట్రేలియా ధాటికి రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. అనంతరం 2017లో ఫైనల్ చేరినా.. ఇంగ్లండ్‌ను నిలువరించలేక తొలిసారి కప్‌ను ఒడిసిపట్టే అవకాశం చేజార్చుకుంది. ఈసారి.. పుష్కర కాలం తర్వాత వరల్డ్ కప్ పోటీలకు ఆతిథ్యమిచ్చిన భారత్ అతికష్టంతో సెమీస్ బెర్తు ఖాయం చేసుకోగా.. వరుణుడి దెబ్బకు శ్రీలంక ఆశలు ఆవిరయ్యాయి. ఆరంభ పోరులో లంకపై, అనంతరం పాకిస్థాన్‌పై సూపర్ విక్టరీలతో జోరు చూపించిన టీమిండియా వరుస ఓటములతో వెనకబడింది. న్యూజిలాండ్‌తో చావోరేవో పోరులో ఓడితే ఇక సెమీస్ ఆశలు గల్లంతే అనుకున్నవేళ ఓపెనర్లు స్మృతి మంధాన ప్రతీకా రావల్ లు సెంచరీలతో చెలరేగారు. జెమీమా రోడ్రిగ్స్ మెరుపు అర్ధ శతకంతో భారీ స్కోర్ చేసిన భారత్.. ఆ తర్వాత ప్రత్యర్థిని కట్టడి చేసి ఊపిరిపీల్చుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో వర్షం పదేపదే అడ్డుపడినా బంగ్లాదేశ్‌ను వణికించారు బౌలర్లు. కానీ.. ఫీల్డింగ్ చేస్తుండగా ఓపెనర్ ప్రతీక కుడి కాలి మడిమ గాయంతో టోర్నీకి దూరమైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న తను కీలకమైన సెమీస్ ఆడకపోవడం హర్మన్‌ప్రీత్ సేనకు గట్టి ఎదురుదెబ్బే. ఎందుకంటే.. ఆస్ట్రేలియాపై వైజాగ్‌లో మంధానతో కలిసి అర్ధ శతకం బాదేసిన ప్రతీక మరో పెద్ద ఇన్నింగ్స్ ఆడుతుందని అభిమానులు ఆశించగా నిరాశే మిగిలింది. ఆమె స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చిన షఫాలీ వర్మకు ఓపెనింగ్ ఛాన్స్ ఇస్తారా? అనేది తెలియాల్సి ఉంది. ప్రతీక రావడానికి ముందునుంచే మంధానతో ఇన్నింగ్స్ ఆరంభించి.. శుభారంభాలు ఇచ్చిన ఈ లేడీ సెహ్వాగ్‌కు ఛాన్స్ ఇస్తే మాత్రం.. దూకుడుగా ఆడాలని టీమ్ కోరుకుంటోంది. 2017 వరల్డ్ కప్ రెండో సెమీఫైనల్లో ఆసీస్‌పై 171 నాటౌట్ (115 బంతుల్లో) శతకంతో విరుచుకుపడిన హర్మన్‌ప్రీత్ ఈసారి అలాంటి ఒక చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడడం చాలా ముఖ్యం. అలానే.. మిడిలార్డర్లో హర్లీన్ డియోల్, జెమీమా, దీప్తి, రీచా ఘోష్‌లు బ్యాట్ ఝులిపిస్తేనే ఆస్ట్రేలియాకు సవాల్ విసిరే స్కోర్ సాధ్యమవుతుంది. ఎనిమిదిసార్లు ఛాంపియన్ అయిన కంగారూ టీమ్‌ను ఓడించాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో టీమిండియా ఇంకాస్త మెరుగవ్వాల్సి ఉంది. గత మ్యాచ్‌లో సెంచరీతో మెరిసిన అలీసా హేలీని త్వరగా ఔట్ చేస్తే కొంతవరకూ ఆసీస్‌పై ఒత్తిడి పెంచవచ్చు. అయితే.. ఇప్పటికే రెండు శతకాలు బాదేసిన అష్ గార్డ్‌నర్, పాక్‌పై దంచేసిన బేత్ మూనీలను పవర్ ప్లేలోనే ఔట్ చేయడానికి రేణుకా సింగ్, క్రాంతి గౌడ్ వ్యూహాలు పన్నాల్సిందే. అలానే డెత్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయడం చాలా ముఖ్యం. సెమీస్ ఫలితంతోనే కొత్త ఛాంపియన్ అవతరించేనా? లేదా? అనేది ఖాయమైతుంది. అందుకే.. ఆసీస్, ఇంగ్లండ్ ఆధిపత్యానికి గండికొడుతూ.. భారత్, దక్షిణాఫ్రికా ఫైనల్ చేరాలని యావత్ క్రీడాలోకం కోరుకుంటోంది. అదే జరిగితే.. ఈసారి విశ్వ విజేతగా కొత్త టీమ్‌ను చూస్తాం.జ

## క్రీడా వాయిస్

### టీమిండియాతో తొలి టీ20..
### ఆసీస్ తుది జట్టులో డేంజరస్ ప్లేయర్లు!



భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టీ20 కాన్‌బెర్రా బుధవారం(అక్టోబర్ 29) జరగనుంది. టీమిండియాతో వన్డే సిరీస్‌ను సొంతం చేసకున్న ఆస్ట్రేలియా.. ఇప్పుడు టీ20 సిరీస్‌ను కూడా కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. తొలి టీ20లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను విజయంతో ఆరంభించాలని కంగారులు వ్యూహాలు రచిస్తున్నారు. భారత్ తమ తుది జట్టును ఖరారు చేయడానికి తర్జన భర్జన పడుతుంటే, ఆస్ట్రేలియా మాత్రం ఇప్పటికే తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఫైనలైజ్ చేసినట్లు తెలుస్తోంది. ఆసీస్ సెలక్టర్లు ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ కోసం రెండు వేర్వేరు జట్లను ప్రకటించారు. తొలి రెండు టీ20లకు దూరంగా ఉండనున్న స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్.. ఆఖరి మూడు టీ20లకు ఎంపిక చేసిన జట్టులో మాత్రం చోటు దక్కించుకున్నాడు. అదేవిధంగా యాషెస్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్‌కు ఆఖరి మూడు టీ20లకు సెలక్టర్లు విశ్రాంతి ఇచ్చారు.

**టీమిండియా కంటే బెటర్‌గా..**

గతేడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన తర్వాత.. ఆస్ట్రేలియా పొట్టి క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో వరుస సిరీస్‌ల విజయాలతో ఆసీస్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ర్యాంకింగ్స్‌లో కంగారుల కంటే భారత్ ముందుంజలో ఉన్నప్పటికి.. ఇటీవల కాలంలో ఆటగాళ్ల ప్రదర్శన పరంగా కంగారులే మెరుగ్గా కన్పిస్తున్నారు. టీ20 వరల్డ్‌కప్-2024 తర్వాత ఆస్ట్రేలియా ఇప్పటివరకు 19 టీ20లు ఆడి కేవలం కేవలం రెండు మాత్రమే ఓడిపోయింది. ఆసీస్ బ్యాటింగ్ రన్‌రేట్ 10.07గా ఉండగా, భారత్ 9.69తో రెండో స్థానంలో ఉంది. గతంతో పోలిస్తే ఆస్ట్రేలియా బ్యాటింగ్ అప్రోచ్ పూర్తిగా మారిపోయింది. మిచెల్ మార్ష్ నాయకత్వంలోని ఆసీస్ జట్టు ఫియర్ లెస్ బ్యాటింగ్ విధానాన్ని ఎంచుకుంది. ఓపెనర్ల నుంచి ఎనిమిదో స్థానం బ్యాటర్ వరకు హిట్టింగ్ చేసే సత్తా ఉంది. మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ అద్భుతమైన ఆరంభాలను ఇస్తుండగా.. మిడిలార్డర్‌లో జోష్ ఇంగ్లిష్, టిమి డేవిడ్ వంటి విధ్వంసకర ఆటగాళ్లు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడుతున్నారు. ఆఖరిలో స్టోయినిష్, ఓవెన్ వంటి ఆల్‌రౌండర్లు తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇటీవల కాలంలో పేసర్ దుర్షనియస్ కూడా బ్యాట్‌తో సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ ఛాన్నాళ్ల తర్వాత ఆసీస్ టీ20 జట్టులోకి వచ్చాడు. అతడు కూడా తన బ్యాట్‌కు పనిచెబితే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. ఇక తొలి తొలి టీ20కు స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా దూరమైనప్పటికి.. జోష్ హాజిల్‌వుడ్, ఈల్లీస్, బార్ట్‌లెట్ వంటి పేస్ పవర్ హౌస్ ఆసీస్ వద్ద ఉంది.





# రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా

మాస్ జాతర సినిమాతో మూవీ లవర్స్‌కు పక్కా వినోదాన్ని అందించేందుకు రెడీ అవుతున్నాడు టాలీవుడ్ యాక్టర్ రవితేజ. శుక్రవారం మాస్ జాతర పెయిడ్ ప్రీమియర్ వేయనున్నారు. ఈ చిత్రంతోపాటు కిశోర్ తిరుమల దర్శకత్వంలో కూడా ఆర్‌టీ 76 ప్రాజెక్టును చేస్తున్నాడు. ఈ మూవీ 2026 సంక్రాంతి రిలీజ్‌కు రెడీ అవుతుంది. కాగా ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజ కొత్త మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో రౌండప్ చేస్తోంది. జాతి రత్నాలు, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో సూపర్ ఫేం సంపాదించాడు యంగ్ యాక్టర్ నవీన్ పొలిశెట్టి. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న అనగనగా ఒక రోజు 2026 సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ ఇద్దరు సంక్రాంతి హీరోలు కలిసి ఓ సినిమా చేయబోతున్నారట. ధమాకా రైటర్ ప్రసన్నకుమార్ బెజవాడ రవితేజ, నవీన్ పొలిశెట్టి కోసం ఓ కథను సిద్ధం చేసి వారికి వినిపించగా.. ఇద్దరూ స్క్రిప్ట్‌కు బాగా కనెక్ట్ అయ్యారని ఇన్‌సైడ్ టాక్. ఎక్కడికి పోతావు చిన్నవాడా, నా సామి రంగా, నేను లోకల్, దాస్ కా ధమ్‌కీతోపాటు పలు చిత్రాలకు డైలాగ్స్ అందించాడు ప్రసన్న కుమార్ బెజవాడ. రవితేజ, నవీన్ పొలిశెట్టిలో కామిక్ టైమింగ్ విషయానికొస్తే ఎవరి స్టైల్ వారిదే. మరి అంతా అనుకున్నట్టు కుదిరితే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడం పక్కా అని చెప్పొచ్చు. మరి ఈ క్రేజీ కాంబోపై రానున్న రోజుల్లో అధికారిక ప్రకటన ఏమైనా వస్తుందనేది చూడాలి. మరి ఈ ఇద్దరిని డైరెక్ట్ చేసేది ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

# దాదాసాహెబ్ ఫాల్కే సలహా బోర్డ్ సభ్యురాలిగా సుధారెడ్డి



దాదా సాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సలహా బోర్డ్ సభ్యురాలిగా ప్రముఖ వ్యాపారవేత్త, సాంస్కృతిక రాయబారి సుధారెడ్డిని నియమితులయ్యారు. ఈమె కాకుండా బోర్డ్‌లో హిందూజా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ కల్నల్ పి.సి. సూద్, బరోడా మహారాణి హెచ్.హెచ్. రాధికరాజే గైక్వాడ్, వి.ఎం. సల్గావ్కార్ కార్పొరేషన్ చైర్మన్ దత్తరాజ్ సల్గావ్కార్, ఇండియన్ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా, ఇండియన్ కొరియోగ్రాఫర్ షియామక్ దావర్, దాదాసాహెబ్ ఫాల్కే ముని మనవరాలు గిరిజా ఫాల్కే మరాఠే, ఇన్ఫర్మేషన్ %డ% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో గౌరవనీయ సాంస్కృతిక నిపుణుడు %డ% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ భావనా మర్చంట్, సినీపోలిస్ ఇండియా ఫిల్మ్ ప్రోగ్రామింగ్ %డ%డిస్ట్రిబ్యూషన్ హెడ్ మయాంక్ ష్రాఫ్ మరియు భారత ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ %డ% బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ %డ% మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ జ్యోతి బధేకా తదితరులు ఉన్నారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే వారసత్వంలో డీపీఐఎఫ్‌ఎఫ్ సలహా బోర్డ్.. సాంస్కృతిక ప్రతిష్టకు నిలయంగా ఉద్భవించింది. కళాకారులు, చిత్రనిర్మాతలు, పరిశ్రమ నాయకులను నిరంతరం గౌరవిస్తూనే సినిమా రంగంలో ప్రపంచ కేంద్రంగా భారతదేశం యొక్క స్థాయిని బలోపేతం చేస్తుంది. ఇకపోతే అక్టోబరు 29-30వ తేదీల్లో ముంబై వేదికగా దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అవార్డులు-2025 కార్యక్రమం జరగనుంది.

# 10 రోజుల్లో రూ. 55 కోట్లు.. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ధ్రువ్ విక్రమ్ 'బైసన్'




తమిళ అగ్ర నటుడు విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటించిన 'బైసన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఈ చిత్రం విడుదలైన 10 రోజుల్లోనే రూ.55 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ తెలుపుతూ.. బైసన్ రన్ ఇంకా కొనసాగుతుంది. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు అంటూ రాసుకొచ్చాడు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో రెండో వారంలో ఈ చిత్రానికి భారీగా స్క్రీన్స్ పెరిగాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళలో థియేటర్లు పెరగడంతో మంచి కలెక్షన్లు రాబడుతుంది ఈ చిత్రం. ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ జోడీగా నటించిన ఈ సినిమాకు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాను పా.రంజిత్ నీలం ప్రొడక్షన్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, శాంతి సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. పశుపతి, రజిషా విజయన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు.

# అల్లు అర్జున్- అట్లీ మూవీ.. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్



పుష్ప -2 బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ మరో భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో ఆయన జతకట్టారు. వీరిద్దరి కాంబోలో తొలిసారి వస్తోన్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై కొన్ని నెలలుగా చర్చ నడుస్తూనే ఉంది. ఇప్పటికే ఈ మూవీలో బాలీవుడ్ భామ దీపికా పదుకొణెను ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. అంతే కాకుండా మరో ముగ్గురు రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నారని టాక్ నడిచింది. ఈ నేపథ్యంలోనే తాజాగా హీరోయిన్‌కు సంబంధించిన మరో వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో సీతారామం బ్యూటీ హీరోయిన్‌గా కన్‌ఫామ్ అయినట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మృణాల్ షూట్‌లో కూడా పాల్గొన్నారని లేటెస్ట్ అప్‌డేట్. అంతేకాకుండా అల్లు అర్జున్‌తో కీలక సన్నివేశాలు షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కాంబోలో మృణాల్ ఎంట్రీతో మూవీపై మరింత బజ్ ఏర్పడింది. ఇప్పటికే ఈ సినిమాకు హాలీవుడ్ టచ్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ మూవీలో హాలీవుడ్ హీరో విల్ స్మిత్ సైతం నటిస్తున్నట్లు కూడా వార్తలొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ మరికొందరిని హాలీవుడ్ పరిశ్రమకు చెందిన నటీనటులను ఈ మూవీ కోసం తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ సినిమాను దాదాపు రూ. 800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే.




# ఈ సారి మామూలుగా ఉండదు'.. డకాయిట్ కొత్త రిలీజ్ డేట్

టాలీవుడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తోన్న ఇంటెన్స్ యాక్షన్ ప్రేమకథా చిత్రం డకాయిట్ ఇప్పటికే రిలీజ్ తేదీ ప్రకటించినా అనివార్య కారణాలతో వాయిదా పడుతూనే వస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ నుంచి కోలీవుడ్ భామ శృతిహాసన్ అనూహ్యంగా తప్పుకుంది. ఇది కూడా సినిమా ఆలస్యానికి కారణం కావొచ్చని తెలుస్తోంది. ఆ తర్వాత సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఈ మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్‌మస్ సందర్భంగా రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ వారు అనుకున్న తేదీ ప్రకారం కుదరకపోవడంతో తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు డకాయిట్ మేకర్స్. వచ్చే ఏడాది ఉగాది కానుకగా డకాయిట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. 'ఈ సారి మామూలుగా ఉండదు.. వెనక్కి తిరిగి చూసేదే లేదు' అంటూ అడివి శేష్ మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో డకాయిట్ సందడి చేయనుందని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. దీంతో అడివి శేష్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మూవీని షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన 'క్షణం', గూఢచారితో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామేన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. కాగా.. ఇప్పటికే ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌ను ఆకట్టుకుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com